సోమవారం
09-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 79
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

జలదిగ్బంధంలోనే విజయవాడ కాలనీలు

ముంచుకొస్తున్న మరో గండం!



విస్తార వర్షాలతో ఉత్తరాంధ్ర అతలాకుతలం

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, కాలువలు
- ప్రమాదస్థాయికి జలాశయాలు
- మరో రెండ్రోజులు భారీ వర్షసూచన
- పాఠశాలలకు సెలవు
- విజయవాడను వీడని వరద
- కొనసాగుతున్న సహాయ చర్యలు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం/పాడేరు/శ్రీకాకుళం/పార్వతీపురం: రాష్ట్రానికి వాన గండం ఇప్పట్లో తప్పేలా కనిపించడం లేదు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికే కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలు అతలాకుతలం కాగా... విజయవాడ నగరంలో 30శాతం ముంపునకు గురైంది. వారం రోజుల పైబడి నగరం జల దిగ్బంధంలోనే ఉంది. కాగా బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో శనివారం నుండి విస్తారంగా కురుస్తుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు రాబోయే రెండురోజుల్లో ఉత్తరాంధ్రలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. అటు విశాఖలో కుండపోత వర్షం కురుస్తోంది. విరిగిపడుతున్న కొండచరియలతో స్థానికులు భయం గుప్పిట్లో ఉన్నారు. కాగా కళింగపట్నానికి తూర్పున 280 కిలో మీటర్లు, గోపాల్‌పూర్‌కు తూర్పు-ఆగ్నేయంగా 230 కిలోమీటర్లు, పారాదీప్‌కు దక్షిణ-ఆగ్నేయంగా 260 కిలో మీటర్లు, దిఘాకు దక్షిణంగా 390 కిలో మీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైందని... ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని విశాఖపట్నం వాతావరణ కేంద్రం హెచ్చరించింది. సోమవారం సాయంత్రం లేదా రాత్రికి పూరీ - దిఘాల మధ్య వాయుగుండం తీరాన్ని దాటే అవకాశం ఉంది. ఈ ప్రభావంతో రానున్న రెండు రోజులలో కోస్తా జిల్లాలలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అప్రమత్తం చేసింది. దీనికి అనుబంధంగా 7.6 కిలోమీటర్ల

- మిగతా 2 లో

అప్రమత్తం కావాలి

చెరువులు, కాల్వలకు గండ్లు పడకుండా చూడాలి

టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జిల్లాల్లో నమోదైన వర్షపాతాన్ని అంచనా వేసుకుని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లు, ఉన్నతాధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, ఆయా జిల్లాల్లో పరిస్థితులపై జిల్లా కలెక్టర్లను, అధికార యంత్రాంగాన్ని సీఎం అప్రమత్తం చేశారు. ఆదివారం కలెక్టర్లతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలను సీఎంకు కలెక్టర్లు వివరించారు. ఆయా జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితులు, తీసుకుంటున్న చర్యలు, సన్నద్ధతను సీఎంకు తెలిపారు. చంద్రబాబు తగిన సూచనలు చేస్తూ సోమవారం చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాల ప్రభావం కనిపిస్తోందని, ఏలేరు రిజర్వాయర్‌కు ఎక్కువ వరద వచ్చే అవకాశముందని, జలాశయాల నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని చెప్పారు. జలాశయాల్లోకి వచ్చే ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో సమతుల్యం చేసుకుని సమర్థవంతంగా ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టాలన్నారు. కాల్వలు, చెరువులు, డ్రెయిన్లకు గండ్లు పడకుండా చూసుకోవాలని, భారీ, అతిభారీ వర్షాలు పడేందుకు అవకాశం ప్రాంతాల్లో తాగునీరు, ఆహారం, వైద్య శిబిరాలకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణనష్టం లేకుండా చూసుకోవాలని చెప్పారు. ముందస్తు చర్యలతో ఆస్తి నష్టాన్ని తగ్గించవచ్చు అని, పంటనష్టం అంచనా, బాధితులకు ఆహారం సరఫరా, వరద పరిస్థితులను గమనించేందుకు డ్రోన్లు వినియోగించాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని, వరద ప్రభావిత ప్రాంత ప్రజలకు నచ్చజెప్పి పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. పరిస్థితి తీవ్రతను బట్టి సహాయం కోసం సెంట్రల్ కంట్రోల్ టీమ్‌ను సంప్రదించాలని, ఏజెన్సీలో భారీ వర్షాలు, వాగులు వంకల పరిస్థితిపై అధికారులు నిరంతరం

- మిగతా 2 లో

ప్రకాశం బ్యారేజీకి మొదటి ప్రమాద హెచ్చరిక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో ప్రకాశం బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీజేశారు. వాగులు, వంకలు పొంగి పొర్లడంతో ఎగువ నుంచి శ్రీశైలం, సాగర్, పులిచింతల నుంచి బ్యారేజీకి నీరు వస్తోంది. దీంతో లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రానికి బ్యారేజి వద్ద 4,50,242 క్యూసెక్కులకుపైగా వరద ప్రవహిస్తోంది. బ్యారేజీ నీటి మట్టం 13 అడుగులు ఉంది, 70 గేట్ల ద్వారా 4,50,442 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి పంపుతున్నారు. పులిచింతల, సాగర్ నుంచి పెరిగిన వరద నీరు విడుదల చేశారు. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షంతో వరద ప్రవాహం మరింత పెరుగుతోంది.

భారత్‌లో మంకీపాక్స్ కలకలం

న్యూఢిల్లీ: ప్రాణాలుతీసే మంకీపాక్స్ వ్యాప్తి చాలా దేశాలను కలవరపెడుతున్న సమయంలో భారత్‌లోనూ ఈ కేసు నమోదైంది. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్న దేశం నుంచి వచ్చిన ఓ యువకుడిలో ఎంపాక్స్ లక్షణాలు గుర్తించినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. వెంటనే అతడిని ఐసోలేషన్‌లో ఉంచామని, ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు తెలిపింది. రోగి నుంచి నమూనా సేకరించి ఎంపాక్స్ నిర్ధారణ కోసం పంపించామని వివరించింది. నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని, ఇదే

- మిగతా 2 లో

పోరాడి గెలిచిన యువ కెరటం

భువనేశ్వర్: పుస్తకాలు సైతం కొనుక్కోలేని పేదరికం ఒకవైపు... ఊళ్లో ఇంటర్నెట్ సేవలు అందుబాటులో లేని పరిస్థితి మరోవైపు... ఇలాంటి ప్రతికూలతలను అధిగమించి డాక్టర్ కావాలన్న తన కలను తొలి ప్రయత్నంలోనే సాకారం చేసుకున్నాడో ఆదివాసీ యువకుడు. అతడే ఒడిశాలోని కంధమాల్ జిల్లాకు చెందిన సనాతన్ ప్రధాన్. అత్యంత ప్రతికూలతలను సైతం విజయ సోపానాలుగా మలచుకున్న ఆ యువకుడి ప్రయాణం ఎంతో

- మిగతా 2 లో

హైడ్రా హడల్

- కొనసాగుతున్న కూల్చివేతలు
- 'లేక్ ప్రొటెక్షన్' బాధ్యతలు హైడ్రాకు అప్పగింతపై కసరత్తు
- నివాసం ఉంటున్న ఇళ్లను కూల్చం: రంగనాథ్

విశాలాంధ్ర-హైదరాబాద్/శేరిలింగంపల్లి: అక్రమార్కుల కబ్జాలకు గురైన చెరువులను విడిపించే పనిని హైడ్రా ఉధృతంగా కొనసాగిస్తోంది. అధికార, ప్రతిపక్ష పార్టీ అన్న తేడా లేకుండా హైడ్రా తనపని తాను చేసుకుపోతోంది. ఈ క్రమంలోనే ఆదివారం సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పెద్ద చెరువు ఎఫ్టిఎల్, బఫర్ జోన్‌లలో అక్రమ నిర్మాణాలను హైడ్రాధికారులు కూల్చివేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డికి చెందిన నిర్మాణాలను నేలమట్టం చేశారు. నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఏమాత్రం తగ్గటం లేదు. హెచ్‌ఎండీఏ పరిధిలోని ఏడు జిల్లాల్లో చెరువుల పరిరక్షణకు... లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఛైర్మన్ బాధ్యతలను సైతం హైడ్రాకు అప్పగించడంపై ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇదే జరిగితే హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, గజ్వేల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో చెరువుల ఆక్రమణలకు చెక్ పడుతుందనే వాదన బలంగా వినిపిస్తోంది.

చైనాలో యాగి బీభత్సం 2లో

గరళం!

కొల్లేరు భవితవ్యం కలవరం

- విషతుల్య నీరు తాకేందుకే భయపడుతున్న ప్రజలు
- కబ్జాకోరుల విధ్వంసం
- కుంచించుకుపోతున్న తాగునీటి సరస్సు
- వ్యర్థాలకు డంప్‌గా మారిన వైనం
- కమిటీల సిఫార్సులు బుట్ట దాఖలు

విశాలాంధ్ర బ్యూరో- ఏలూరు: నీరు ప్రతి జీవికి ప్రాణాధారం. ఈ భూమిపై లభించే నీటిలో .5 శాతం మాత్రమే తాగటానికి పనికివస్తుందని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దీనిని సాధారణంగా స్వచ్ఛమైన నీటిగా పరిగణిస్తారు. మినరల్స్ ఎక్కువగా ఉంటాయని అభిప్రాయ పడింది. ఆసియాలోనే అతి పెద్ద మంచినీటి సరస్సు కొల్లేరు. భారతదేశంలో

- మిగతా 2 లో

మళ్లీ భగ్గుమన్న మణిపూర్

హింసాత్మక ఘటనల్లో ఆరుగురి మృతి

ఇంఫాల్: మణిపూర్ రాష్ట్రంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల కాలంలో జరుగుతున్న డ్రోన్ బాంబు దాడులు కలకలం రేపుతున్నాయి. ఈ పరిణామాలతో స్థానికంగా మరోసారి హింసాకాండ చెలరేగింది. జిరిబామ్ జిల్లాలో శనివారం జరిగిన హింసాత్మక ఘటనల్లో ఆరుగురు

- మిగతా 2 లో

ఊరట!

- గండ్లు పూడికతో విజయవాడలో తగ్గిన వరద
- వర్షాలతో ముంపు బాధితుల కలవరం
- కాలనీలు... అధికారులు అప్రమత్తం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎట్టకేలకు బుడమేరు గండ్లపూడిక పనులు పూర్తవ్వడంతో ముంపు వాసులకు కాస్త ఊరట కలగనుంది. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి శాంతినగర్ దగ్గర బుడమేరుకు పడిన మూడో గండి పనుల్ని ఆర్మీ సైన్యం, ఇరిగేషన్, ఏజెన్సీలు సంయుక్తంగా శ్రమించి పూడ్చివేశారు. మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో వర్షాలు పడటంతో బాధితులు కలవరం చెందుతున్నారు. విజయవాడలోనూ తేలికపాటి వర్షాలు కురుస్తుండడంతో పల్లపు ప్రాంతాల్లోకి నీరు చేరడం వారిని ఆందోళన కలిగిస్తోంది. జలదిగ్బంధంలో ఉన్న కాలనీలు నీటి నుంచి తేరుకుంటుండగా... మళ్లీ వర్షం రావడంతో నీరు పెరిగే ప్రమాదముందని బాధితులు వాపోతున్నారు. గండ్ల పూడిక పూర్తయినప్పటికీ... భారీ వర్షాలతో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మహారాష్ట్రలో మహిళలకు బీజేపీ ఎర

ఆర్వీ రామారావ్

ఈ దేశంలో సకలం రాజకీయ మయమే. ఏం చేసినా రాజకీయ ప్రయోజనాల మీదే దృష్టి ఉంటుంది. మోదీ అధికారంలోకు వచ్చిన తరవాత ఈ ధోరణి మరీ ఎక్కువైంది. రావడి (తాయిలాల) రాజకీయాలు కూడదని మోదీ సుద్దులు ఐతే చెప్తారు కానీ ఎన్నికలు జరగవలసిన చోటల్లా ఆయన దృష్టి తాయిలాల పంపిణీ మీదే ఉంటుంది. తాయిలాలు పంచడం కోసం ఏ రాష్ట్రంలోనైనా ఎన్నికల కార్యక్రమాన్ని నిర్దేశించగల శక్తి సామర్థ్యాలు మోదీకి ఉన్నాయి.

సాధారణంగా రెండు మూడు రాష్ట్రాలకు దాదాపు ఒకే సమయంలో ఎన్నికలు జరగవలసి ఉంటే వాటి శాసనసభా కాలం ముగిసే సమయంలో స్వల్పమైన తేడాలు ఉన్నప్పటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం రివాజు. జమ్మూ-కశ్మీర్, హర్యానా శాసనసభల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వు జారీ చేసింది. జమ్మూ-కశ్మీర్‌లో సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ ఒకటిన పోలింగ్ నిర్వహించి అక్టోబర్ నాలుగున ఫలితాలు ప్రకటిస్తామని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. హర్యానా శాసనసభకు ఒకే విడత అక్టోబర్ ఒకటిన పోలింగ్ నిర్వహిస్తామని ప్రకటించిన ఎన్నికల కమిషన్ పోలింగ్ తేదీని అక్టోబర్ అయిదు నాటికి మార్చింది. అందువల్ల ఓట్ల లెక్కింపు 8న జరుగుతుంది. ఈ రెండు శాసనసభలతో పాటే మహారాష్ట్ర శాసన సభ ఎన్నికలు కూడా జరగాలి. కిందటి సారి ఈ రెండు రాష్ట్రాలకు ఒకే సారి ఎన్నికలు నిర్వహించారు. ఈ రెండు రాష్ట్రాల శాసనసభల గడువు నవంబర్‌లోనే ముగుస్తుంది. కానీ మహారాష్ట్ర ఎన్నికల కార్యక్రమం మాత్రం ఇంకా ప్రకటించలేదు. ఏమైనప్పటికి నవంబర్ మూడో వారానికల్లా మహా రాష్ట్ర శాసనసభ ఎన్నికలు కూడా పూర్తి కావలసిందే.

మహారాష్ట్ర శాసన సభ ఎన్నికల నిర్వహణను ఎందుకు జాప్యం చేస్తున్నట్టు? అక్కడ ప్రస్తుతం శివసేన చీలిక వర్గం, నేషనలిస్ట్ కాంగ్రెస్ చీలికవర్గం, బీజేపీతో కూడిన సంకీర్ణ ప్రభుత్వం ఉంది. ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేనను, శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీని చీల్చి ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా, అజిత్ పవార్, దేవేంద్ర ఫడ్నవిస్ ఉపముఖ్యమంత్రులుగా అక్కడ ప్రభుత్వం ఏర్పడింది. 2022 జూన్ నుంచి అధికారంలో ఉన్న షిండే ప్రభుత్వంపై ప్రజలకు అనేక రకాల అసంతృప్తి ఉంది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ తొమ్మిది స్థానాలతో సరిపెట్టుకోవలసి వచ్చింది.

ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేన వర్గం ఎన్నికల కమిషన్ నిర్ణయం ప్రకారం ఏ స్థితిలో ఉన్నా జనాదరణలో మాత్రం షిండే వర్గంకన్నా మిన్నగా ఉంది. అజిత్ పవార్ మళ్లీ శరద్ పవార్ చెంతకు చేరుతారన్న గుసగుసలు తరచుగా వినిపిస్తున్నాయి. ప్రాంతీయంగా బలం ఉన్న పార్టీలను చీల్చి ఛిన్నాభిన్నం చేసి అధికారం సంపాదించడం బీజేపీకి అలవాటైన వ్యవహారం. మహారాష్ట్రలో ఈ విద్య ఎంతగా ప్రదర్శించినా బీజేపీకి అనుకున్నంత మేలు జరగలేదు. ఈ పరిస్థితిలో శాసనసభ ఎన్నికలు నిర్వహిస్తే ఉన్న అధికారం కాస్తా ఊడుతుందన్న భయం బీజేపీ అధిష్ఠాన వర్గాన్ని పీడిస్తోంది. అందుకే తమ గుప్పెట్లో ఉన్న ఎన్నికల కమిషన్‌ను ఒప్పించో, ఒత్తిడి చేసో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కార్యక్రమం

- మిగతా 2 లో

కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నాం

ఎట్టకేలకు అంగీకరించిన పాక్



రావల్పిండి: కార్గిల్ యుద్ధంలో తాము పాల్గొన్నట్లు ఎట్టకేలకు పాకిస్థాన్ అంగీకరించింది. ఈ మేరకు ఆ దేశ సైన్యాధిపతి జనరల్ ఆసిమ్ మునీర్ బహిరంగ ప్రకటన చేశారు. దీంతో పాతికేళ్ల తర్వాత పాక్ సైన్యం తమ పాత్రను అంగీకరించినట్లయింది. రావల్పిండిలోని ఆర్మీ ప్రధాన కార్యక్రమంలో శుక్రవారం పాక్ డిఫెన్స్ డే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మునీర్ మాట్లాడుతూ, "భారత్, పాకిస్థాన్ మధ్య 1948, 1965, 1971, కార్గిల్ యుద్ధం, సియాచిన్ ఘర్షణల్లో వేలాది మంది మన సైనికులు ప్రాణత్యాగం చేయాల్సి వచ్చింది" అని అన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. 1999 మే-జులై మధ్య కార్గిల్ యుద్ధం జరిగింది. ముజాహిదీన్ ముసుగులో నియంత్రణ రేఖను దాటి భారత భూభాగంలోకి చొచ్చుకుని వచ్చిన శత్రుసేనలు... కార్గిల్‌లో ఖాళీగా ఉన్న భారత కీలక స్థావరాలను వశం చేసుకున్నాయి. కౌంటర్‌గా ఇండియన్ ఆర్మీ 'ఆపరేషన్ విజయ్' పెట్టింది. ఈ ఎదురుదాడితో బెంబేలెత్తిపోయిన పాక్... తోకముడుచుకుని పారిపోయింది. జులై 26న పాక్ సైన్యాన్ని తరిమి కొట్టినట్లు భారత్ సైన్యం ప్రకటించింది. అప్పటి నుంచి జులై 26ను కార్గిల్ విజయ్ దివస్‌గా భారత్ పాటిస్తోంది. ఈ యుద్ధంతో తమ సైన్యానికి ఎలాంటి సంబంధం లేదని ఇప్పటి వరకు పాక్ చెబుతూ వస్తోంది. ముజాహిదీన్ ఫైటర్లు ఈ దాడులకు పాల్పడ్డారని ఆరోపించింది. తాము పెట్రోలింగ్ మాత్రమే చేశామని చెప్పింది. గతంలో పాక్ ఆర్మీ మాజీ అధికారి ఒకరు కూడా కార్గిల్‌లో తమ దేశ బలగాల పాత్ర నిజమేనని అంగీకరించారు. ఆ ఆపరేషన్‌ను 'ఫోర్ మ్యాన్ షో' అని లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) షాహిద్ అజీజ్ అభివర్ణించారు. అయితే పాక్ ఆయన వ్యాఖ్యలపై స్పందించలేదు.

అమెరికా డ్రోన్ కూల్చేసిన హౌతీలు

సనా: అమెరికాకు చెందిన అత్యాధునిక నిఘా డ్రోన్‌ను కూల్చేసినట్లు యెమెన్ కేంద్రంగా పనిచేసే తీవ్రవాద సంస్థ హౌతీ ప్రకటించింది. యెమెన్ గగనతలంలో ఎగురుతున్న ఎమ్‌క్యూ-9 మానవరహిత విమానాన్ని(యూఏవీ) కూల్చేసినట్లు హౌతీ ప్రతినిధి యాహ్యా సారీ ప్రకటించారు. హౌతీ నియంత్రణలోని యెమెన్ భూభాగంపై అమెరికా వైమానిక దాడులకు పాల్పడినట్లు ఆరోపించారు. యెమెన్ రాజధాని సనాను 2014లో హౌతీలు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అమెరికాకు చెందిన అనేక డ్రోన్లు, నిఘా విమానాలను తీవ్రవాదులు కూల్చేశారు. 'మారిబ్ గవర్నరేట్ గగనతలంలో రీపర్ శత్రు కార్యకలాపాలకు పాల్పడుతోంది. అందుకే దానిని కూల్చేశాం. పలస్తీనా ప్రజలు, యెమెన్ రక్షణ కోసం హౌతీలు దాడులు కొనసాగిస్తూనే ఉంటారు' అని యాహ్యా సారీ చెప్పారు. అమెరికా నిఘా డ్రోన్ ఎమ్‌క్యూ-9 విమానాన్ని పోలి ఉంటుంది. దీన్ని రిమోట్‌తో పనిచేయిస్తారు. పైలట్‌లు ఉండరు. సాధారణ డ్రోన్‌లతో పోలిస్తే ఈ నిఘా డ్రోన్ చాలా ఎత్తులో ఎగరగలదు. 50 వేల అడుగుల ఎత్తులో 24 గంటలపాటు నిరంతరాయంగా ఎగురుతూ కీలక సమాచారం సేకరించే సామర్థ్యం దీని సొంతం.

దీని విలువ సుమారు రూ.250కోట్లకు పైనే ఉంటుంది. ఇజ్రాయెల్- పలస్తీనాకు చెందిన ఉగ్రవాద సంస్థ హమాస్‌కు మధ్య జరుగుతున్న యుద్ధంలో హౌతీలు పలస్తీనాకు మద్దతు పలుకుతున్నారు. ఎర్రసముద్రంలోని వాణిజ్య నౌకలు లక్ష్యంగా కొంత కాలం నుంచి హౌతీలు దాడులు చేస్తున్నారు. ఇటీవల గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో ఒక వాణిజ్య నౌకపై క్షిపణితో దాడి చేశారు.

పోరాడి గెలిచిన యువ కెరటం

(మొదటిపేజీ తరువాయి)

స్ఫూర్తిదాయకం. దేశంలోని వైద్య కళాశాలల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఏటా నిర్వహించే నీట్ పరీక్షకు లక్షల మంది విద్యార్థులు పోటీ పడుతుంటారు. తల్లిదండ్రులు ఎన్ని అవకాశాలు, వసతులు కల్పించినా కొందరికి డాక్టర్ కావాలన్న కల ఓ కలగానే మిగిలిపోతోంది. కానీ, తన దృఢ సంకల్పంతో, కఠోర శ్రమతో, స్నేహితుల నుంచి పుస్తకాలు అరువు తెచ్చుకొని మరీ చదివిన ఈ యువకుడు తన తొలి ప్రయత్నంలోనే నీట్ పరీక్షలో సత్తా చాటాడు. డాక్టర్ కావాలన్న తన ఆశయాన్ని సాకారం చేసుకోవడం ద్వారా ఆ కుటుంబానికి గర్వకారణంగా నిలవడమే కాదు.. అత్యంత పరిమితమైన అవకాశాలున్న ఆ ప్రాంతానికి ఓ ఆశాదీపంలా మారాడు.

చైనాలో యాగి బీభత్సం

ప్రచండ గాలులకు కొట్టుకుపోయిన జనాలు

బీజింగ్: చైనాలో యాగి తుపాన్ బీభత్సం సృష్టించింది. తుపాన్ ప్రభావంతో గంటకు 234 కి.మీ వేగాన్ని మించి బలమైన గాలులు వీచాయి. ప్రచండ గాలులకు వాహనాలతో సహా మనుషులు కొట్టుకుపోయారు. అనేక చోట్ల రేకుల షెడ్లు గాల్లోకి ఎగిరిపోయాయి. దీనికి సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతున్నాయి. యాగి తీవ్ర తుపాను కారణంగా రెండు రాష్ట్రాల్లోని నదులకు వరద ముప్పు పొంచి ఉంది. తుపాను నేపథ్యంలో హైనాన్ రాష్ట్రంలో వెంగ్టియాన్ టౌన్‌షిప్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించవచ్చని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. హైనాన్‌లోని నాండు, చాంగువా నదులకు వరద ముప్పు ఉందని ప్రజలను అలర్ట్ చేసింది. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గౌంగ్‌డాంగ్‌లో 5.70 లక్షలమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాజా తుపానుపై చైనా జాతీయ వాతావరణ కేంద్రం రెడ్ అలెర్ట్ జారీ చేసింది. యాగీ తుపాన్ కారణంగా దాదాపు 8 లక్షల ఇళ్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తుపాన్ కారణంగా పదుల సంఖ్యలో మరణాలు సంభవించాయి. 92 మంది గాయపడ్డినట్టు చైనా ప్రభుత్వం తెలిపింది. మరణాల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. యాగీ తుపాన్ ప్రభావం ప్రస్తుతం వియత్నాం మీద కూడా ఉంది. అక్కడ కూడా ఎడతెరపిలేని వర్షం కురుస్తూ భీకర గాలులు విస్తున్నాయి.

భారత్‌లో మంకీపాక్స్ కలకలం

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో వ్యాధి సంక్రమణ మూలాలను గుర్తించేందుకు కాంటాక్ట్ ట్రేసింగ్ కొనసాగుతోందని పేర్కొంది. ఈ వ్యాధి తీవ్రతపై జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం ముందస్తుగానే అంచనాలు వేసిందని... ఆందోళన చెందాల్సి అవసరం లేదని చెప్పింది. ఇటువంటి కేసులు వెలుగు చూసిన సందర్భంలో వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు పూర్తి సంసిద్ధతతో ఉన్నట్లు పేర్కొంది. మరోవైపు ప్రాణాంతక ఎంపాక్స్ వ్యాప్తి ఆఫ్రికా దేశాల్లో ఆందోళనకర రీతిలో ఉన్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే 18 వేల అనుమానిత కేసులు, 926 మరణాలు సంభవించాయి. కొత్తరకం కేసులు ఇప్పటివరకు 258 నమోదైనట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. ఆఫ్రికాలోని బురుండి, రువాండా, కెన్యా, ఉగాండాతోపాటు స్వీడన్, థాయ్‌లాండ్ దేశాల్లోనూ ఈ కేసులు వెలుగు చూశాయి. భారత్‌లో ఈ ఏడాది మార్చి తర్వాత ఈ కేసులు నమోదు కాలేదు.

మళ్లీ భగ్గుమన్న మణిపూర్

(మొదటిపేజీ తరువాయి)

ప్రాణాలు కోల్పోయారు. మొదట ఓ వ్యక్తిని నిద్రలోనే కాల్చి చంపడంతో ఇరువర్గాల మధ్య కాల్పులకు దారితీసింది. ఈ క్రమంలోనే మరో ఐదుగురు సాయుధులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు చూరాచాంద్‌పూర్‌లో మిలిటెంట్లకు చెందిన మూడు బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. బిష్ణుపూర్ జిల్లాలో రాకెట్ దాడులను ఇక్కడ్నుంచే చేపట్టినట్లు సమాచారం. రాకెట్ దాడుల ఘటనల్లో బిష్ణుపూర్ జిల్లాలో ఓ వృద్ధుడు మరణించగా... ఆరుగురు గాయపడ్డారు. మొదటి దాడి తెల్లవారుజామున 4.30 గంటలకు ట్రోంగ్లావ్‌బిలో జరిగింది. రెండు నిర్మాణాలు దెబ్బతిన్నాయి. రెండో దాడి మధ్యాహ్నం 3గంటలకు మొయిరంగ్‌లోని మాజీ సీఎం మైరెంబమ్ కొయిరెంగ్ నివాస ఆవరణలో రాకెట్ పడి అందులో అమర్చిన బాంబు పేలింది. దీంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఆరుగురు గాయపడ్డారు. ఈ నేపథ్యంలోనే చూరాచాంద్పూర్‌లోని మువాల్ సంగ్, లైకా మువాల్సు గ్రామాల్లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన బలగాలు... మూడు బంకర్లను కూల్చివేశాయి. కుకీ మిలిటెంట్లు జరుపుతున్న దాడులతో మణిపూర్ మరోసారి భగ్గుమంది. భారీగా భద్రతా బలగాలు మోహరించి పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారు. పెరుగుతున్న హింసకు ప్రతిస్పందనగా, భద్రతా దళాలు బహుముఖ విధానాన్ని అమలు చేశాయి. యాంటీ-డ్రోన్ వ్యవస్థను మోహరించడం, ఆర్మీ హెలికాప్టర్లతో గస్తీ నిర్వహిస్తున్నారు. అనుమానిత కుకీ తిరుగుబాటుదారులు ఇంఫాల్ వెస్ట్ జిల్లాలోని గ్రామాలపై దాడిలో ఆయుధాలతో కూడిన డ్రోన్‌లను ఉపయోగించారని, భారత గడ్డపై ఇటువంటి దాడి జరగడం ఇదే మొదటిసారి పోలీసు అధికారులు తెలిపారు. కొండలు, లోయ ప్రాంతాలలో కూంబింగ్ ఆపరేషన్లు కొనసాగుతున్నాయని, హింసను ప్రేరేపించే వారిని గుర్తించడానికి బృందాలు సోషల్ మీడియాను పర్యవేక్షిస్తున్నాయని పోలీసులు పేర్కొన్నారు.

యూనిఫైడ్ కమాండ్ నియంత్రణ కోసం సీఎం డిమాండ్

దాడుల నేపథ్యంలో రాష్ట్రంలో భద్రతా కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్న యూనిఫైడ్ కమాండ్ నియంత్రణ కోసం సీఎం ఎన్ బీరెన్ సింగ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యూనిఫైడ్ కమాండ్‌ను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారులు, రాష్ట్ర భద్రతా సలహాదారు, సైన్యం నిర్వహిస్తోంది. కాగా రాష్ట్ర భద్రతా సమస్యలను పరిష్కరించడానికి యూనిఫైడ్ కమాండ్ నియంత్రణను సీఎం కోరుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు సీఎం బీరెన్ సింగ్... బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి తమ డిమాండ్ల లేఖను రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ఆచార్యకు అందజేసినట్లు అధికారవర్గాల సమాచారం. ఈ డిమాండ్ల జాబితాలో ప్రముఖంగా.. యూనిఫైడ్ కమాండ్ అప్పగించడం ద్వారా రాజ్యాంగం ప్రకారం ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వానికి తగిన అధికారాలు, బాధ్యతలు ఉంటాయని పేర్కొన్నట్లు తెలుస్తోంది. సీఎం అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 355 మణిపూర్‌లో అమలులో ఉందని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తెలియజేయలేదని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఆర్టికల్ 355... ప్రతి రాష్ట్రాన్ని దురాక్రమణ, అంతర్గత దాడుల నుంచి రక్షించే బాధ్యతను కేంద్రానికి ఇచ్చింది. ఇక.. ఈ ఆర్టికల్‌ను విధించడం అంటే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాడానికి కేంద్రం సిద్ధమైనట్లే అని సమాచారం. గత ఏడాది మణిపూర్‌లో మైతేయి, కుకీ తెగల మధ్య చెలరేగిన హింసలో ఇప్పటి వరకు 220 మంది మృతిచెందగా.. సుమారు 50 వేల మంది అంతర్గతంగా నిరాశ్రయులయ్యారు.

గరళం!

(మొదటిపేజీ తరువాయి)

అతిపెద్ద మంచినీటి సరస్సుగా పేరున్న కొల్లేరు భవితవ్యం కలవర పెడుతోంది. ప్రకృతి ప్రసాదించిన వనరులను సద్వినియోగం చేసుకోకపోతే ఎలాంటి చిక్కులు వస్తాయనేది ప్రస్తుతం కొల్లేరు చాటుతోంది. నీళ్లు ఇప్పుడు తాగడానికి సాహసించలేని పరిస్థితి నెలకొంది. కబ్జాకోరుల విధ్వంసకాండ ఫలితంగా పర్యావరణానికి, జీవన వైవిధ్యానికి పెనుముప్పు వచ్చింది.

ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో కొల్లేరు సరస్సు విస్తరించి ఉంది. కేజీ (కృష్ణ, గోదావరి) బేసిన్ పరిధిలోని చిత్తడి నేలలో లక్ష 20 వేల ఎకరాల మేర విస్తరించి ఉండేది. దీని పరిధిలో 122 లంక గ్రామాలలో ఐదు లక్షల మంది నివసిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, దెందులూరు, పెదపాడు, భీమడోలు, ఉంగుటూరు, ఆకివీడు, నిడమర్రు మండలాల పరిధిలో 20 బెడ్ గ్రామాలు (సరస్సు లోపల), 63 బెల్ట్ గ్రామాలు (సరస్సు ఆనుకుని) ఉన్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని కైకలూరు, మండవల్లి మండలాల పరిధిలోని 26 బెడ్, 13 బెల్ట్ గ్రామాలు కొల్లేరు పరిధిలో విస్తరించి ఉన్నాయి. బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు, గుండేరు,లాంటి చిన్న పెద్ద ఏరుల నుంచి కొల్లేరుకు నీరు వచ్చి చేరుతుంది. ఏలూరు, కైకలూరుకు చెందిన మురుగునీరు కూడా కొల్లేరులోకి వస్తోంది. దీంతోపాటు బుడమేరు, రామిలేరు, తమ్మిలేరు నుంచి ప్రధానంగా రసాయనాలు, ప్లాస్టిక్ వ్యర్థాల చేరికతో కొల్లేరు నీరు పూర్తిగా కాలుష్య కోరల్లో చిక్కుకుంది. సహజసిద్ధ చేపల పెంపకం, రొయ్యల సాగు అనేక సమస్యలు తెచ్చిపెట్టింది. దీని వల్ల స్థానికుల ఆదాయం పెరిగింది కానీ కొల్లేరు స్వరూపం మాత్రం మారిపోయింది. మనిషి కాలు మోపడానికి కూడా అంగీకరించని అభయారణ్య చట్టం పరిధిలో ఉన్నప్పటికీ భారీ స్థాయిలో కాలుష్య కారకాలను డంప్ చేస్తుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. విజయవాడ, ఏలూరు, గుడివాడ పట్టణాల చెత్తను సైతం ఈ సరస్సులోనే డంప్ చేస్తున్నారు. స్థానిక పరిశ్రమల నుంచి ట్యాంకర్ల ద్వారా రసాయనాలను తెచ్చి డంప్ చేస్తున్నారు. వ్యవసాయంలో వాడే కెమికల్స్, క్రిమిసంహారకాలతో కలిసిన నీరు సరస్సులోకి చేరుతుంది. సమీప గ్రామాలలోని చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా డంప్ చేస్తున్నారు. ఆసుపత్రులలో వాడిన సిరంజ్ లు,ఇంజక్షన్ సీసాలు,సెలైన్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలూ ఇందులోనే వేస్తున్నారు. రోజుకు 10 టన్నుల చెత్తను చేరుస్తూ కొల్లేరు సరస్సు సహజత్వాన్ని కోల్పోయేటట్లు చేస్తున్నారు. ఒకప్పుడు కొల్లేరు నీరు తాగిన స్థానికులు ప్రస్తుతం తాగునీరు లేక అల్లాడిపోతున్నారు. వాటర్ ప్లాంట్ లే దిక్కు అన్న చందంగా మారిపోయింది.

కొల్లేరు పరిధిలో మత్స్య ఉత్పత్తులకు గిరాకీ ఎక్కువ. చిత్తడి నేలలు, జీవావరణం కారణంగా చేపలు వేగంగా పెరుగుతాయి. రుచి కూడా ఎక్కువ అని ప్రతీతి. చేపల చెరువు సాగుతో కోట్లలో ఆర్జించవచ్చు అన్నది నానుడి. అందుకే అక్రమార్కుల కళ్లు అభయారణ్యంపై పడ్డాయి. రాజకీయ అండదండలతో వేల ఎకరాలు ఆక్రమించారు. అక్రమార్కుల వ్యాపార దాహం కొల్లేరును కకావికలం చేస్తోంది. 2001 ఫిబ్రవరి 9న తీసిన ఉపగ్రహ చిత్రాల ప్రకారం కొల్లేరులో అప్పటికే 42 శాతం ఆక్రమణకు గురైనట్లు వెలుగు చూసింది.2006 లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొల్లేరులో అక్రమ చేపల చెరువులను అప్పటి వైయస్ సర్కార్ ధ్వంసం చేసింది. అప్పటికే 80శాతం ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. 5వ కాంటూర్ వరకైనా సురక్షితంగా ఉందనుకుంటే అదీ లేదు. ఆక్రమణలు ఆగనే లేదు. నాడు తండ్రి ధ్వంసం చేస్తే ,2019-24 మధ్య వైయస్ తనయుడు జగన్ ఏలుబడిలో యథేచ్ఛగా తవ్వకాలు సాగాయి. మంచినీటి సరస్సుగా చెప్పుకునే కొల్లేరు నీటిని ఇప్పుడు తాకేందుకు సాహసించలేని పరిస్థితి. రసాయనాలతో కూడిన చేపల ఫీడ్, చెరువులను శుభ్రపరిచేందుకు వాడే మందులతో కొల్లేరు పరిసరాలు, భూగర్భ జలాలు కాలుష్య భరితమయ్యాయి.

కొల్లేరు సమస్యలపై ప్రభుత్వాలు వివిధ కమిటీలను నియమించాయి. శ్రీరామకృష్ణయ్య కమిటీ నివేదిక ప్రకారం కొల్లేరు చానళ్ల రెగ్యులేషన్‌పై దృష్టి సారించాల్సి ఉంది. మిత్రా కమిటీ సిఫారసులు చేసినప్పటికీ అమలుకు నోచుకోకపోవ డంవల్లే ప్రస్తుతం కొల్లేరు రాను రాను కుచించుకుపోతోందని స్థానికులు చెబుతున్నారు. కాంటూరు రీ సర్వే చేసి, పారిశ్రామిక, ఇతర వ్యర్థాలు, రసాయనాలు అరికట్టి, అటు పర్యావరణం, ఇటు స్థానిక ప్రజలకు సమస్యలు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ముంచుకొస్తున్న మరో గండం!

(మొదటిపేజీ తరువాయి)

ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది క్రమంగా ఉత్తర దిశగా కదులుతూ పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాల వైపు పయనిస్తుందన్నారు. అదే సమయంలో బలమైన ఈదురుగాలులు వీస్తాయని... సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేసింది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు ఏరులై పారుతున్నాయి. జలాశయాలన్నీ ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ కేంద్రం సూచన చేసింది. ఈ మేరకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇక విశాఖ, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ జిల్లాలతో పాటు యానాంలలో భారీ వర్షాలు కురుస్తాయని, ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తున్నట్టు పేర్కొంది. విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలలో తక్కువ సమయంలో ఎక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని తెలిపింది. తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు గరిష్టంగా 60 కిలోమీటర్లు బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఇక రానున్న మూడు రోజులు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని విశాఖ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. కళింగపట్నం, భీమునిపట్నం, గంగవరం, కాకినాడ పోర్టులలో అధికారులు మూడవ నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గడిచిన 24 గంటలలో అత్యధికంగా విజయనగరం, కళింగ పట్నం 11 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. విశాఖపట్నంలో 68 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వరద నీటిలో ఉత్తరాంధ్ర జిల్లాలు

ఉత్తరాంధ్ర జిల్లాలైన విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లా లో తెరుపు లేకుండా భారీగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. అనేక చోట్ల రహదారులు దెబ్బతినడంతో రవాణా సౌకర్యం అందుబాటులో లేదు. గత రెండు రోజులుగా అనేక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తీరం వెంబడి వీస్తున్న ఈదురు గాలులకు చెట్లు నేల కూలాయి.

- విశాఖ నగరంలో కుండపోత వర్షాలతో కొండవాలు ప్రాంతాల్లో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. పశ్చిమ నియోజకవర్గం గోపాలపట్నం రామకృష్ణనగర్ లో కొండవాలు ప్రాంతాల నుండి మట్టి పెళ్లలు జారిపడుతున్నాయి. దీంతో సమీప ఇళ్లల్లోని వారిని ఖాళీ చేయించి... పునరావాస కేంద్రాలకు తరలించారు. భీమిలి నియోజకవర్గంలో వివిధ పాఠశాలల భవనాల ప్రహరీ గోడలు కూలిపోయాయి. మల్కాపురం, గాజువాక , మధురవాడలో అనేక కొండవాలు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అల్లూరిజిల్లా రాజవొమ్మంగి మండలం బోర్నగూడెం వద్ద లోయ లో ఆర్టీసీ బస్సు పడిపోయింది. 20 మంది ప్రయాణికులకు గాయాలు కాగా, ఐదుగురు ని మెరుగైన వైద్యానికి పాడేరు ఆసుపత్రికి తరలించారు. ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆదివారం ఉదయం 9 గంటల వరకు 46.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గుర్ల-10 సెంటీమీటర్లు, నెల్లిమర్ల-9, విజయనగరంలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బొబ్బిలి మండలం కొత్తపెంట వద్ద పెంట చానల్ కు గండి పడింది. బొబ్బిలి వద్ద పారధి వంతెన వద్ద కాజ్ వే దెబ్బతింది. రేగిడి మండలంలో సాయన్న గెడ్డ, ఆకులవ గడ్డ పొంగిపొర్లుతున్నాయి. మడ్డువలస జలాశయానికి భారీగా వరద నీరు చేరుతోంది. తాటిపూడి జలాశయం పూర్తి నీటి మట్టం 297 అడుగులు కాగా, ప్రస్తుత ం 294.2 అడుగులుగా ఉంది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరంలో 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న రిజర్వాయర్లు ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయి, నాగావళి, వంశధార, రైవాడా, తాండవ, తాటిపూడి, మేఘాద్రి గెడ్డ, గంభీరం, పెద్ద గెడ్డ, తోటపల్లి వంటి జలాశయాల్లో ప్రమాదకర స్థాయికి వరద నీరు చేరడంతో తీర ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.
- శ్రీకాకుళం జిల్లాలో వంశధార నది కి వరద పెరగడం తో గొట్టా బ్యారేజ్ గేట్లను ఎత్తి 8 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నాగావళికి వరద పోటు పెరగడం తో నారాయణ పురం ఆనకట్టకు వస్తున్న 18500 క్యూసెక్కుల వరద నీటిని కిందికి విడిచిపెడుతున్నారు.
- భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాలలోని పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రకటనలు విడుదల చేశారు. వర్షాల దృష్ట్యా అన్నియాజమాన్యాల్లో పనిచేస్తున్న పాఠశాలలు మూసివేయాలని స్పష్టం చేశారు. ఇందుకనుగుణంగా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

అప్రమత్తం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

సమాచారం తెప్పించుకోవాలన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద వస్తే ఒక జిల్లా నుంచి మరో జిల్లా అధికారులు సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. వరద, భారీ వర్షాలపై ప్రజల ఫోన్లకు అలర్ట్ సమాచారం పంపాలని, వాగులు, వంకలు దాటే సమయంలో ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా ఆంక్షలు విధించాలని కోరారు. వినాయకుని నిమజ్జనానికి కూడా వెళ్లి ప్రమాదం బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఊరట!

(మొదటిపేజీ తరువాయి)

బుడమేరుకు వరద ప్రవాహం పెరుగుతోంది. తెలంగాణ రాష్ట్రంలో మున్నేరు వాగు ఉప్పొంగడం, వరద ప్రవాహం పోటెత్తడం వెరసి బుడమేరులోకి వరద నీరు వస్తోంది. ఎనిమిది వేల క్యూసెక్కుల వరకూ వరద నీరు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. బుడమేరువాగు నుంచి పులివాగు, గుర్రపువాగుల్లోకి వరద నీరు కలవడంతో లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరే అవకాశముందని గుర్తించారు. మూడో గండి పూడ్చివేతతో విజయవాడ సింగ్‌నగర్ వరద ప్రవాహం తగ్గిపోనుందని మంత్రులు నిమ్మల రామానాయుడు, నారాయణ స్పష్టంచేశారు. ఇటీవల భారీ వర్షాలతో బుడమేరు డైవర్షన్ ఛానల్‌కు గండ్లు పడ్డాయి. విజయవాడ నగరంలోని కాలనీలను వరద ముంచెత్తింది. బుడమేరుకు గండ్లకు గండి పడటమేనని ప్రభుత్వం గుర్తించి, వాటి పూడిక పనులకు నిమగ్నమైంది. గండ్ల పనులను నిమ్మల, నారా లోకేశ్ నిరంతరం పర్యవేక్షిస్తూ... యుద్ధప్రాతిపదికన ముందుకెళ్లేలా చూశారు. మొదటగా రెండు గండ్లను అధికార యంత్రాంగంతో పూడ్చివేయగా, 100 మీటర్ల పొడవుతో ఉన్న మూడో గండి అసాధ్యంగా మారింది. పనులకు అంతరాయం కలగకుండా . ఒక వైపు సైనిక దళం, మరొక వైపు ఏజెన్సీల సిబ్బంది పూడ్చివేశారు. ఇనుప జాలీలతో కూడిన బుట్టలు ఉపయోగించి, రెండు పొరల విధానంలో గండి పూడ్చే వ్యూహం అమలు చేశారు. సైనిక బృందంలో చెన్నయ్, సికింద్రాబాద్‌కు చెందిన 120 మంది జవాన్లు ఉన్నారు.

వారం రోజులు జలదిగ్బంధంలోనే...

వారం రోజులుగా ఇంకా కొన్ని కాలనీలు ముంపులో ఉన్నాయి. ఇప్పుడిప్పుడే బయట పడుతున్నాయి. విజయవాడ నగరంలోని పాలఫ్యాక్టరీ, కేఎల్‌రావునగర్, సాయిరామ్‌నగర్, చిట్టినగర్ ప్రాంతాల్లో వరద నీరు భారీగానిలిచింది. వారంతా ఆహారం, మంచినీటి కోసం అల్లాడిపోయారు. కాలకృత్యాల్ని తీర్చుకోలేని దుస్థితి ఏర్పడింది. దుకాణాల్లోకి భారీగా వరద నీరు చేరి తీవ్ర నష్టాన్ని కలిగింది. వరదలకు కొట్టుకుపోయిన ఖరీదైన కార్లు, వాహనాలు బయటపడుతున్నాయి. అక్కడక్కడా మృతదేహాలూ లభ్యమవ్వడం ప్రజలను ఆందోళన కలిగిస్తోంది. వరద తగ్గిన కాలనీల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేశారు. సహాయక చర్యలు ఊపందుకున్న దశలో మళ్లీ వర్షం రావడం వల్ల పనులకు ఆటంకం కలుగుతోంది. భారీ వర్షాలతో భయాందోళనలో ప్రజలున్నారు. వరద వాణిజ్య కేంద్రమైన విజయవాడ నగరానికి అపార నష్టాన్ని మిగిల్చింది. పేదల జీవితాలతోపాటు చిన్న తరహా పరిశ్రమలను ముంచేసింది. రూ. కోట్లు విలువ చేసే సరుకు, మిషనరీ పనికిరాకుండా పోయింది. వందలాది మంది కార్మికులు నిరాశ్రయులయ్యారు.

దిగువకు బుడమేరు ఉధృతి...రోడ్లపైకి వరద

బుడమేరు ప్రవాహం దిగువకు వెళ్లడంతో రాకపోకలకూ అంతరాయం ఏర్పడింది. కంకిపాడు నుంచి ఉప్పులూరుకి వెళ్లే రహదారిపైకి నీరు పొంగి కారులో వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చిక్కుకుపోయాడు. గన్నవరం మండలం కేసరపల్లి-కంకిపాడు రహదారి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు వరద నీటిలో నుంచి బైక్‌పై వెళుతున్న యువకుడు నీట మునిగే ప్రమాదంలో చిక్కుకోవడంతో సీఐ శివప్రసాద్ రక్షించారు. ఈనెల ఏడో తేదీ రాత్రి బుడమేరులో కొట్టుకుపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారి ఫణి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కారులో వెళుతుండగా బుడమేరు ఉధృతికి గల్లంతైనట్లు తెలిసింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. వరద నీటిలో ఉన్న బాధితులను శిబిరాలకు తరలించేందుకు చర్యలు చేపట్టారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు వర్షం ఎడతెరపి లేకుండా కురవడంతో జాతీయ రహదారులపైకి, విజయవాడ నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు పారుతోంది.

మహారాష్ట్రలో మహిళలకు బీజేపీ ఎర

(మొదటిపేజీ తరువాయి)

విడుదల కాకుండా బీజేపీ అగ్ర నాయకత్వం ఆపగలిగింది.

కొంత సమయం చిక్కితే బీజేపీ పుంజుకునేట్టు చేసి విజయం సాధించవచ్చునన్నది బీజేపీ అగ్రనాయకత్వం పథకం. ప్రస్తుతం షిండే నాయకత్వంలోని మహాయుతి కూటమి విజయం సాధించడం బీజేపీ లక్ష్యం కాదు. బీజేపీ ఒంటరిగా అధికారంలోకి రావడానికి అనువైన పరిస్థితులు ఏర్పడేలా చేయడమే బీజేపీ లక్ష్యం. అలా జరగాలంటే ఓటర్లకు ఏదో ఆశ చూపాలి. అది తమకు ప్రయోజనకారి అన్న నమ్మకం ఓటర్లకు కలగాలి. అప్పుడు సంక్షేమ పథకాలవల్ల ప్రయోజనం పొందిన వారు బీజేపీకి అనుకూలంగా మారారు. ఈ ఉద్దేశంతోనే హడావుడిగా ముఖ్యమంత్రి మాఝి లడ్కి బహెన్ పథకాన్ని అమలులో పెట్టారు. దీనివల్ల 21 నుంచి 65 ఏళ్ల మధ్య ఉన్న మహిళలకు నెలకు 1500 రూపాయలు అందుతాయి. లబ్ధి పొందే మహిళల కుటుంబ వార్షిక ఆదాయం రెండున్నర లక్షలకు లోపు ఉండాలి. ఈ పథకం ప్రవేశ పెడుతున్నట్టు గత ఆగస్టు 17న ప్రకటించినా అమలు మాత్రం జులై ఒకటి నుంచే చేస్తామని చెప్పారు. నెలకు 1500 నేరుగా అర్హులైన లబ్ధి దారుల ఖాతాలోకి వెళ్తాయి. ఇప్పటికే కొంత మంది ఖాతాల్లోకి రెండు నెలల మొత్తం జమ చేశారు. ఈ పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ. 46,00 కోట్లు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. కోటి మందికి ఈ పథకం వర్తింప చేస్తారట.

ఈ పథకం ద్వారా లబ్ధి పొందే వారికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు కనక జన్‌ధన్ ఖాతా జాతర జరిగినప్పుడు బ్యాంకు ఖాతాలు తెరవని వారు మహారాష్ట్రలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల ముందు బారులు తీరారు. ఎక్కడ చూసినా వీరి సందడే. ఈ పథకం అమలుకు రెండు మూడు నెలల సమయం అవసరం అవుతుంది కనక హర్యానా శాసనసభ ఎన్నికలతో పాటే మహారాష్ట్రలో ఎన్నికలు నిర్వహించకూడదనుకున్నారు.

మాఝి లడ్కి బహెన్ పథకం కింద ఇప్పటి వరకు కోటి 80 లక్షల మంది మహిళలు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ నంబర్‌తో అనుసంధానం చేసుకున్నారు. జనధన్ ఖాతాలు తెరిచినప్పుడు ఈ పని చేయని వారు ఇప్పుడు ఎగబడి చేస్తున్నారు. బ్యాంకు సిబ్బంది మీద ఒత్తిడి పెరిగింది. పని పూర్తి చేయడం కోసం వారు పొద్దుటి నుంచి రాత్రి 11 గంటల దాకా పని చేయాల్సి వస్తోంది. ఎక్కువ సేపు పని చేయని సిబ్బంది మీద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. అంగన్‌వాడీ సేవిక దగ్గర నుంచి జిల్లా కలెక్టర్లకు కూడా ఈ పనిని పర్యవేక్షించే బాధ్యత అప్పగించారు. ఈ పథకానికి అంత ప్రాధాన్యత ఇవ్వడానికి కారణం ఉంది. రాహుల్ గాంధీ తాము అధికారంలోకి వస్తే మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలకు 8,500 జమ చేస్తామని చెప్పారు. దీన్నే అప్పటి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పకడ్బందీగా అమలు చేసి జనం చేత మామ అనిపించుకున్నాడు. ఈ పథకం పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, జార?ండ్, తమిళ నాడు, కర్నాటక, మధ్య ప్రదేశ్ లోనూ అమలు అవుతోంది. తెలంగాణ, పంజాబ్ ప్రభుత్వాలు కూడా ఇలాంటి పథకాలు అమలు చేస్తామని చెప్పాయి కానీ ఇప్పటిదాకా దమ్మిడీ అందలేదు. అయితే కొన్ని రాష్ట్రాలలో అర్హతా ప్రమాణాలు, అందించే మొత్తంలో తేడాలు ఉన్నాయి. బెంగాల్ లో 2021 ఫిబ్రవరి నుంచే లక్ష్మీ భండార్ పేరుతో, కర్నాటకలో గృహలక్ష్మి పేరుతో, తమిలనాడులో మరో పేరుతో ఈ పథకాలు అమలులో ఉన్నాయి. ఈ పథకం అమలు చేస్తే తప్ప మహారాష్ట్ర ఎన్నికలలో గట్టెక్క లేమని బీజేపీ గ్రహించినందువల్లే ఇప్పుడు హడావుడిగా అమలు చేస్తున్నారు.

లోకసభ ఎన్నికలలో మహారాష్ట్రలో ఇండియా ఐక్య సంఘటనకు 48 శాతం ఓట్లు వస్తే ఎన్డీయే 36 శాతం ఓట్లతో సంతృప్తి పడాల్సి వచ్చింది. ఆదివాసుల్లో 55 శాతం ఇండియా ఐక్య సంఘటనకు, ఎన్డీయేకు 35 శాతం ఓటు వేశారు. ప్రభుత్వ పథకాల వల్ల లబ్ధిదారులు తమకే ఓటు వేస్తారన్న బీజేపీ నమ్మకం వమ్ము అయింది. ఈ అవాంతరం దాటాలంటే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయక తప్పదని బీజేపీ గ్రహించింది. దాని ప్రభావం జనంలో కనిపించడానికి కొంత సమయం అవసరమనుకుని మహారాష్ట్ర ఎన్నికలు హర్యానాతో జరపలేదు. విదర్భలో ఉన్న పది లోకసభ సీట్లలో ఏడు ఇండియా ఐక్య సంఘటన గెలుచుకుంది. 46 శాతం ఓట్లు సాధించింది. బీజేపీకి 37 శాతం ఓట్లు మూడు సీట్లు మాత్రమే వచ్చాయి. విదర్భలో ఆదివాసులు గణనీయమైన సంఖ్యలో ఉంటారు. కులాలు, జాతుల ప్రాతిపదికపై ఆధారపడకుండా మహిళా ఓటర్ల మీద దృష్టి కేంద్రీకరించడానికి బీజేపీ ప్రయత్నిస్తోంది. పశ్చిమ మహారాష్ట్రలో లాభార్థులు 56 శాతం ఉన్నారు. వీరిని తమవేపు తిప్పుకోవడమే బీజేపీ లక్ష్యం. జాతీయ స్థాయిలో మహిళల ఓట్లు 42 శాతం ఇండియా ఐక్య సంఘటనకు దక్కితే ఎన్డీయేకు 36 శాతమే దక్కాయి. ముద్ర యోజన కింద 28 లక్షల రూపాయలు యువతకు దక్కాయి. కానీ దీని ఫలితం ఎన్డీయేకు ఓట్ల రూపంలో ప్రతిబింబించ లేదు. లబ్ధి పొందిన వారందరూ బీజేపీకి ఓటు వేయలేదు.

నేటి నుంచి వరద నష్టం గణన

- ప్రతి వార్డుకు జిల్లాస్థాయి అధికారి
- రెండింటికి ఒక ఐఏఎస్ పర్యవేక్షణ
- రూ.6,882 కోట్ల నష్టమని ప్రాథమిక అంచనా

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మూడు రోజుల పాటు అనగా సోమవారం నుంచి వరద ప్రాంతాలలో నష్టం గణన చేపట్టనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తెలిపారు. గణన సమయంలో నివాసితులు తమతమ గృహాలలో అందుబాటులో ఉంటే పూర్తిస్థాయి వివరాల నమోదు అవకాశం ఉంటుందన్నారు. బృందాలకు విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రం వేదికగా ఆదివారం 1,400 మందికి శిక్షణ ఇచ్చారు. సిసోడియా మాట్లాడుతూ విజయవాడ నగరంలోని 32 వార్డులలో 149 సచివాలయాల పరిధిలో రెండు లక్షల పైచిలుకు నివాసాలలో నష్టం గణన చేపట్టనున్నామని వివరించారు. విజయవాడ రూరల్ మండలంలో ఐదు గ్రామాలు సైతం నష్ట పోయాయన్నారు. 149 మంది తహసీల్దార్‌లతో సహా పలువురి సేవలు వినియోగించుకుంటున్నా మన్నారు. ఎటువంటి పొరపాట్లు జరగకుండా ప్రతి వార్డుకు ఒక జిల్లా స్థాయి అధికారి నేతృత్వం వహిస్తూ రాండమ్‌గా తనిఖీ చేపడతారని వివరించారు. ప్రతి రెండు వార్డులను ఒక ఐఎఎస్ అధికారి పర్యవేక్షిస్తారన్నారు. వార్డు లేదా గ్రామ సచివాలయానికి 10 గణన బృందాలు అంటాయని, వారు ఇంటింటి సర్వే నిర్వహించి అవసరమైన సమాచారాన్ని గృహస్తుల నుంచి తీసుకుంటారని సిసోడియా స్పష్టం చేశారు. ప్రతి బృందంలోనూ ఒక డిప్యూటీ తాహశిల్దార్, వార్డు సచివాలయం ఉద్యోగులు ఉంటారన్నారు. ఎఎన్‌ఎం, మహిళా పోలీసును మినహాయించామన్నారు. కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్‌ల నష్టం గణన కోసం 200 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని చెప్పారు. అధార్ కార్డు అందుబాటులో ఉంచుకుని ఇంటిలో ఉండేందుకు ప్రయత్నించాలని సూచించారు. అదనపు సీసీఎల్ ఏ ప్రభాకర్ రెడ్డి సమన్వయం చేస్తారన్నారు. తొలిదశ ప్రాథమిక అంచనాలను అనుసరించి రూ.6,882 కోట్లు నష్టం వాటిల్లిందని ఇది మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

ప్రజా చైతన్యమే గరికపాటి లక్ష్యం

ప్రజానాట్యమండలి నేతల ఉద్ఘాటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కళ కళకోసం కాదు ప్రజల కోసమని నమ్మి సమాజ హితం కోరుతూ ప్రజా చైతన్యం వైపు అడుగులేసి ఎందరో కళాకారులను సినిమా రంగానికి అందించిన ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు డాక్టర్ గరికపాటి రాజారావు ఆశయాలను కొనసాగిద్దామని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, అధ్యక్షులు చంద్రనాయక్ కొనియాడారు. ప్రజా చైతన్యమే గరికపాటి రాజారావు లక్ష్యంగా తన జీవితకాలం పనిచేశారని చెప్పారు. గరికపాటి 61వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం విజయవాడ దాసరిభవన్‌లో ఎస్కే నజీర్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రనాయక్ మాట్లాడుతూ చైతన్యవంతమైన సమాజం కోసం గరికపాటి రాజారావు లాంటి ఉత్తమ కళాకారులు సమాజానికి నిత్యం అవసరమన్నారు. ఎప్పటికప్పుడూ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజా కళాకారులు తమ కళారూపాల ద్వారా ప్రజల్ని చైతన్యవంతులుగా మార్చడం గరికపాటి రాజారావు నుంచి నేర్చుకోవాలన్నారు. దీనమైన పరిస్థితుల్లో ఉన్న ప్రజలను మేల్కొల్పడానికి కళలను సాధనంగా చేసుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి విజయవాడ నగర సీనియర్ నాయకులు లంక దుర్గారావు, గౌరవాధ్యక్షులు కేవీ భాస్కరరావు, కార్యదర్శి దోనేపూడి సూరిబాబు, షేక్ భాష, సైకం రాము, ఎన్.అంకరాజు పాల్గొన్నారు.

తిరుపతి బైరాగి పట్టెడలోని సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి తిరుపతి జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పెంచలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ రామానాయుడు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గరికపాటి రాజారావు తన జీవితం మొత్తం సమాజ మార్పు కోసం తన ఆలోచనలను రచనలను చేశారనీ, సమాజ వైద్యుడిగా మారి సమాజంలో ఉన్న రుగ్మతలను మూఢనమ్మకాలను రూపుమాపాలంటే కళ అనే ఆయుధంతో ప్రజల్ని చైతన్యవంతం చేయొచ్చని నమ్మి అనేకమంది కళాకారులను తయారు చేయడం నాటక రంగా ఏర్పాటు చేయడం ఆ నాటక రంగంలో నటుడుగా దర్శకుడుగా ఎన్నో నాటకాలను ప్రదర్శించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా, నగర కార్యదర్శులు కె రాధాకృష్ణ , ఎస్ డి రవి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు చుట్టూ రిటైనింగ్‌వాల్

వరద శాశ్వత పరిష్కారానికి సీఎం ఆదేశం: మంత్రి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ సింగ్‌నగర్ చుట్టుపక్కల బుడమేరు వరద క్రమంగా తగ్గుతోందని, బుడమేరు వరద శాశ్వత పరిష్కారం కోసం రిటైనింగ్ వాల్ నిర్మించే ప్రతిపాదన చేస్తున్నామని మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. ఇందిరానాయక్ నగర్‌లో ఆదివారం వరద ముంపు ప్రాంతాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ముంపు బాధితుల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నారాయణ విలేకరులతో మాట్లాడుతూ, భవిష్యత్తులో ఇలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి పెట్టామని, ఇరిగేషన్ కాల్వల ఆక్రమణల వల్ల ఇంత పెద్ద వరద వచ్చిందన్నారు. బుడమేరుకు పడిన గండ్లు పూర్తిగా పూడ్చివేశారని, ఇంకా కట్ట ఎత్తు పెంచాలని నిర్ణయించి పనులు చేపట్టారని తెలిపారు. బుడమేరు వరద నుంచి శాశ్వతంగా ప్రజలకు రక్షణ ఇచ్చేలా కట్ట ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లుగా మంత్రి నారాయణ గుర్తుచేశారు. బుడమేరు గండ్లు పూడ్చడంతో మళ్లీ వరద నగరంలోకి వచ్చే అవకాశంలేదని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందొద్దని భరోసా ఇచ్చారు. అడుగున్నర మేర వరద తగ్గిందని, సోమవారం ఉదయానికి పూర్తిగా వరద నీరు వెళ్లిపోతుందన్నారు. ఫైరింజన్లతో బురదను తొలగించి, పారిశుద్ధ్య పనులు వేగవంతం చేశామని వివరించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా వరద ఎక్కువగా ఉందని, వరద ముంపులో ఉన్న కాలనీలకు ఇంకా అధికంగా ఆహారం పంపిణీ చేయాలని సీఎం ఆదేశించారన్నారు. వరద తగ్గుతుందా లేదా అనే భయంతో కొంతమంది అవసరం లేకున్నా ఎక్కువ ప్యాకెట్లు తీసుకెళ్తున్నారని చెప్పారు. నీరు తగ్గగానే పారిశుధ్య పనులు వేగవంతం చేస్తామని, వర్షంలోనూ వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. వరద నీరు బయటకెళ్లిన 12 గంటల్లో ఆ ఇంటిని పూర్తిగా శుభ్రం చేస్తామన్నారు. 12 లక్షల ఆహార పొట్లాలను మొదట్లో పంపామని, ఇప్పుడు నాలుగు లక్షల పొట్లాలను పంపుతున్నామని చెప్పారు. కాలనీల్లో ఇంకా ముంపులో ఉన్న వరద బాధితులకు అన్నీ అందేలా చూశామని మంత్రి నారాయణ తెలిపారు.

సహాయక చర్యలు ముమ్మరం: అనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరద ముంపు ప్రాంతాల్లో ఎనిమిది రోజులుగా ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి... రాష్ట్ర ప్రభుత్వ సహాయక చర్యలను ప్రపంచవ్యాప్తంగా చూస్తున్నారు... అందరికీ సహాయం అందాలని సీఎం చంద్రబాబు ఎనిమిది రోజులుగా కలెక్టరేట్లోనే ఉండి సమీక్షిస్తున్నారు. ఎలాంటి సమస్యలు రాకుండా అన్ని శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తున్నారు... ఏ ముఖ్యమంత్రి కూడా వరద ప్రాంతాల్లో ఇంతలా పర్యటించలేదు అని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడ కలెక్టరేట్లో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. సీఎం ఆదేశాలతో బాధితులకు మూడు పూటలా ఆహారం అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టామని అన్నారు. రాయితీపై కూరగాయల విక్రయం జరుగుతోందన్నారు. 236 తాగునీటి ట్యాంకర్లు పనిచేస్తున్నాయన్నారు. మూడు రోజుల్లో 60వేల మందికిపైగా రేషన్ పంపిణీ జరిగిందన్నారు. వరద బాధితులకు పులిహోర ప్యాకెట్లు కూడా పంచని గత ప్రభుత్వ నాయకుడు పులిహోర కబుర్లు చెప్తున్నారని విమర్శించారు. మంత్రి నిమ్మల రామానాయుడు నిద్రాహారాలు మాని మూడు రోజులుగా బుడమేరు దగ్గరే ఉండి అంతా సమీక్షించారన్నారు. నష్టాన్ని అంచనా వేసే ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. గణేష్ మండపాలకు ఎక్కడ డబ్బులు వసూలు చేయడం లేదని వివరణ ఇచ్చారు. మైక్ పర్మిషన్‌కు కూడా డబ్బులు తీసుకోవడం లేదని మంత్రి వివరించారు. ప్రకాశం బ్యారేజీ బోట్ల ఘటనపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. బ్యారేజీ గేట్లను ఢీకొన్న బోట్లకు సంబంధించి సమగ్ర విచారణ జరుగుతోందని మంత్రి పేర్కొన్నారు.

మున్సిపల్ కార్మికులకు రక్షణ కల్పించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీల నుంచి విజయవాడకు చేరుకున్న మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం అన్ని విధాల రక్షణ కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వారం రోజులుగా విజయవాడ నగరంలో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న కార్మికులు చాలామంది అనారోగ్యానికి గురై వివిధ ప్రాంతాల్లో ఎలాంటి వైద్య సౌకర్యాలు లేకుండా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పనిలో నిమగ్నమై ఉన్నందున సకాలంలో భోజనాలు కూడా అందడం లేదన్నారు. తెల్లవారుజామున పనికి వెళ్తున్న మున్సిపల్ కార్మికుల ట్రాక్టర్లను మరొక వాహనం ఢీకొన్నందున చాలా మందికి తీవ్ర గాయాలయ్యాయని, వారిని ప్రైవేటు ఆసుపత్రి తరలించి వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. నిరంతరం పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు విశ్రాంతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారం రోజులుగా పనిచేస్తున్న కార్మికులను తిరిగి వారి సొంత మున్సిపాల్టీలకు పంపాలన్నారు. ఇతర మున్సిపాలిటీల నుంచి మరి కొందరు కార్మికుల్ని తీసుకొచ్చి పారిశుధ్య పనులు నిర్వహించాలని ఆయన కోరారు

ఆశాలను విస్మరించిన ప్రభుత్వం

సంఘ అధ్యక్షురాలు సుభాషిణి విమర్శ

విశాలాంధ్ర-కడప రూరల్: గత ప్రభుత్వ హయాంలో ఆశాల సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, వైద్య ఆరోగ్యశాఖలో మహిళా ఉద్యోగులకు రక్షణ చట్టం చేయాలని, ఆశా కార్యకర్తలకు కనీస వేతనం 26వేలుఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి డిమాండ్ చేశారు. ఏఐటియుసీ జిల్లా కార్యాలయం హోచిమిన్ భవన్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మ అధ్యక్షతన జరిగిన ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని ఒప్పంద జీవోలు విడుదల అయ్యేవరకు ఆశా వర్కర్ల రిటైర్మెంట్లు ఆపాలని, రికార్డులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరియమ్మ మాట్లాడుతూ కడప జిల్లాలో మొరగుడి, తాళ్లపల్లి, పెద్దముడియం ఇతర అనేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అదనపు పని చేయాలని మెడికల్ ఆఫీసర్లు ఆశాలను ఒత్తిడి చేస్తున్నారని చెయ్యకపోతే ఉద్యోగాలు మానుకోవాలని మెమోల ద్వారా ఆశాలను వేధిస్తున్నారని అన్నారు. అధికారులు చేస్తున్న భరించరాని వేధింపులు ఆపాలని లేకపోతే జిల్లా వ్యాప్తంగా సమ్మె చేయడం తధ్యమని ఇందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు బాధ్యులని అన్నారు. ఈ సమావేశంలో ఏపీ ఆశా వర్కర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు వరలక్ష్మి, అనసూయ, కోశాధికారి అమ్ములు, జాయింట్ సెక్రెటరీ అనిత, సుధారాణి నాయకులు పాల్గొన్నారు.

అమరావతి మునిగిందని దుష్ప్రచారం చేస్తారా?

వైసీపీపై అమరావతి రైతు జేఏసీ ఆగ్రహం

విశాలాంధ్ర-తుళ్లూరు: అమరావతి రాజధానిపై దుష్ప్ర చారం తగదని... నిన్నటివరకు మూడు రాజధానులంటూ విషం చిమ్మి నేడు అధిక వర్షాలను సాకుగా చూపి రాజధాని మునిగిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైసీపీ నాయకులపై అమరావతి రైతు జేఏసీ నాయకులు మండిపడ్డారు. కొన్ని మీడియా సంస్థలు, కొంతమంది వ్యక్తులు అమరావతి గురించి అబద్ధాలు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో లిఫ్ట్ ఇరిగేషన్ కార్యాలయంలో ఆదివారం అమరావతి రైతు ఐక్య కార్యాచరణ సమితి(జేఏసీ) నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బెల్లంకొండ నరసింహారావు మాట్లాడుతూ రాజధాని అమరావతిలో కొండవీటివాగు, కోటేళ్ల వాగు, పాలవాగు, సార వాగు తదితర వాగులు ఉన్నాయని, వాటి విస్తీర్ణం, స్వభావం గురించి ఏ మాత్రం అవగాహన లేనివారు అమరావతి మునిగిందంటూ ప్రచారం చేస్తున్నారని అన్నారు. రాజధాని నిర్మాణం నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం ద్వారా వరద నీటిని విజయవంతంగా కృష్ణానదిలోకి మళ్లించిన సంగతి అందరికీ తెలుసని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కొండవీటివాగు, ఇతర వాగులో పూడికలు తీయడం, నాచు, గుర్రపుడెక్క, కంప చెట్లు తొలగించడం లాంటి పనులను పూర్తిగా విస్మరించారని తెలిపారు. ధనేకుల రామారావు మాట్లాడుతూ అమరావతిలో సచివాలయం, హైకోర్టు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తదితర భవన సముదాయాల వద్ద నిలిచిన కొద్దిపాటి నీరు తొలగిపోయేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, వైసీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేయడం తగదన్నారు. కళ్లం రాజశేఖర రెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు రాజధాని ఎక్కడ మునిగిందో చూపాలని... అధికారంలో ఉన్నప్పుడు అమరావతి గొంతు పిసికి ఇప్పుడు వర్షాన్ని అడ్డుపెట్టుకొని పిచ్చివాగుడు వాగుతున్నారని అన్నారు. ప్రకాశం బ్యారేజ్‌ను పడవలు ఢీ కొట్టిన వ్యవహారంపై ప్రభుత్వం విచారణ జరిపించి కారకులను కఠినంగా శిక్షించాలని రైతు జేఏసీ కోరుతోందన్నారు. అమరావతి దళిత బహుజన జేఏసీ కన్వీనర్ చిలకా బసవయ్య మాట్లాడుతూ చంద్రబాబు ఇల్లు, అమరావతి మునిగిపోయాయంటూ కొన్ని పత్రికలు చేస్తున్న విష ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళా రైతులు శ్రీదేవి, కొమ్మినేని వరలక్ష్మి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జలవనరుల శాఖ మంత్రులుగా చేసిన అనిల్ కుమార్, అంబటి రాంబాబుకి క్యూసెక్కులకి, టీఎంసీకి తేడా తెలియదని ఎద్దేవా చేశారు. అధిక వర్షాల కారణంగా సచివాలయం ఉద్యోగులు, సిబ్బందికి సెలవు ఇస్తే... వైసీపీ నాయకులు దానిని కూడా రాజకీయం చేయడం సిగ్గుచేట న్నారు. కార్యక్రమంలో అమరావతి రైతులు, రైతు కూలీలు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా, నగర కమిటీలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఏపీసీసీ) నూతన కమిటీలకు ఏఐసీసీ ఆమోదముద్ర వేసింది. 25 జిల్లాల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు (డీసీసీలు), 13 మంది పీసీసీ ఉపాధ్యక్షులు, 37 మంది ప్రధాన కార్యదర్శులు, 10 మంది నగర అధ్యక్షులను ప్రకటించింది. మన్యం అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షుడిగా సాతాక బుల్లిబాబు, శ్రీకాకుళం- అంబటి కృష్ణారావు, విజయనగరం- మరిపి విద్యాసాగర్, విశాఖ- వెంకటవర్మ రాజు, అనకాపల్లి- మీసాల సుబ్బన్న, కాకినాడ-మద్దేపల్లి సత్యానందరావు, బీఆర్ అంబేద్కర్ కోనసీమ- కొండేటి చిట్టిబాబు, తూర్పుగోదావరి- విశ్వేశ్వర్ రెడ్డి, పశ్చిమ గోదావరి- హరికుమార్ రాజు, ఏలూరు- రాజనాల రామ్మోహన్‌రావును నియమించారు. కృష్ణాజిల్లా డీసీసీ అధ్యక్షుడిగా గొల్లు కృష్ణ, ఎన్టీఆర్‌జిల్లా- బొర్రా కిరణ్, గుంటూరు- చిలక విజయ్, బాపట్ల- ఆమంచి కృష్ణమోహన్, పల్నాడు-అలెక్స్ సుధాకర్, ప్రకాశం- షేక్ సైదా, నంద్యాల- జంగేటి లక్ష్మీ నరసింహ యాదవ్, కర్నూలు- పరిగెల మురళీకృష్ణ, అనంతపురం- మధుసూదన్ రెడ్డి, వైఎస్ఆర్ జిల్లా- విజయజ్యోతి, శ్రీ సత్యసాయి-హినయ్ తుల్లా, నెల్లూరు- చేవూరు దేవకుమార్ రెడ్డి, తిరుపతి- బాలగురవం బాబు, చిత్తూరు- పోటుగారి భాస్కం- విజయవాడ నగర అధ్యక్షుడిగా నరహరి శెట్టి నరసింహారావు, కాకినాడ నగర అధ్యక్షుడిగా చెక్కా నూక రాజు- రాజమండ్రి- బాలేపల్లి మురళీధర్, శ్రీకాకుళం- రెల్లా సురేశ్, విశాఖపట్నం- పిరిడి భగత్, తిరుపతి-గౌడపేరు చిట్టిబాబు, చిత్తూరు- టిక్కారామ్, ఒంగోలు- నాగలక్ష్మీ, కర్నూలు- షేక్ జిలానీ భాషా, కడప- అలీఖాన్‌ను నియమించారు.

11న పీసీసీ విస్తృతస్థాయి సమావేశం

విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లో ఈనెల 11వ తేదీన ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ విస్తృతస్థాయి సమావేశం జరగనుంది. కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అధ్యక్షతన మధ్యానం 12 గంటలకు రాష్ట్ర కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ బలోపేతంపై నూతనంగా నియమితులైన డీసీసీ, నగర అధ్యక్షులు, పీసీసీ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులకు షర్మిల దిశానిర్దేశం చేయనున్నారు.

ఏలేశ్వరం నీటిమట్టం పెరుగుదల



విశాలాంధ్ర-ఏలేశ్వరం/ఏలూరు: తూర్పు గోదావరి జిల్లా ఏలేశ్వరం శివారు... ఏలేరు రిజర్వాయర్‌కు నీటిమట్టం రికార్డు స్థాయిలో పెరుగుతోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 86.56 సెంటీమీటర్లు (24.11 టీఎంసీలు). నీటిమట్టం ఆదివారం ఉదయం ఆరు గంటల సమయంలో 84.90 సెంటీమీటర్లు (20.80 టీఎంసీలు) ఉంది. మూడు రోజుల క్రితం కలెక్టర్ ఆదేశాల మేరకు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రమాద స్థాయిని అంచనావేస్తూ క్రమంక్రమంగా అవుట్ ఫ్లో పెంచుతామని అధికారులు తెలిపారు. ఈ మేరకు 2,775 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. ఒక్కరోజే పరీవాహక ప్రాంతాలలో కురిసిన వర్షాలకు రిజర్వాయర్‌లో అధిక మొత్తంలో వరదనీరు వచ్చి చేరుతుంది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇన్‌ఫ్లో 3,894 క్యూసెక్కులకు చేరగా, అవుట్ ఫ్లో 3,275 క్యూసెక్కులుగా ఉంది. రెండు గంటల సమయంలో ఇన్‌ఫ్లో 9,976 క్యూసెక్కులకు చేరింది. సాయంత్రం ఆరు గంటలకు ప్రాజెక్టు నీటి నిల్వలు 85.13 సెంటీమీటర్లకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 12,881 క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 5,775 క్యూసెక్కులుగా ఉంది. ఏలేరు పరీవాహన గ్రామాల ప్రజలను అధికారులు ఇప్పటికే హెచ్చరించారు. ఏలేశ్వరం-అప్పన్నపాలెంకు మధ్య వారధి కుంగిపోయింది. ఎస్ఐ రామలింగేశ్వర రావు, తహసిల్దార్ వెంకటేశ్వరరావు హుటాహుటిన బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జిపై రాకపోకలు నిషేధించినట్లు చెప్పారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఏ క్షణంలోనైనా బ్రిడ్జ్ కూలిపోయే ప్రమాదం ఉన్నందున ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బ్రిడ్జి సుమారు 25 గ్రామాలకు మార్గం. దీంతో ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బ్రిడ్జి పునర్నిర్మాణం చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొల్లేరు ప్రజలు అప్రమత్తం: ఐజీ హెచ్చరిక

కొల్లేరులో భారీగా వరద నీరు చేరుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, ఎస్‌పీ కే ప్రతాప్ శివ కిషోర్ హెచ్చరించారు. పెదపాడు మండలంలో వరద ముంపునకు గురైన గ్రామాలను ఆదివారం ఎస్ఐ శుభశేఖర్‌తో కలిసి వీరు పరిశీలించారు. పాత పెదపాడు, కొనికి, సత్యవోలు, నాయుడుగూడెం, వడ్డీగూడెం, గుడిపాడు గ్రామాలలో ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ నుంచి అతి భారీ వర్షాల మూలంగా వరద నీరు లోతట్టు ప్రాంతాలకు వచ్చి చేరటంతో క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన సహాయక చర్యలపై ఆదేశాలు జారీ చేశారు.

సమన్వయంతో వ్యవహరించండి

గత వారం రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో బుడమేరు వాగు పొంగిపొర్లుతుం టంతో కొల్లేరులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్న దృష్ట్యా మూడు జిల్లాల ఎస్పీలు సమన్వయంతో వ్యవహరించి ప్రాణనష్ట లేకుండా చూడాలని ఏలూరు రేంజ్ ఐజీ సూచించారు. పెద్దఎడ్లగాడి ప్రాంతంలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరదనీటి ప్రాంతాన్ని పరిశీలించారు.

సేవ చేయడం అంటే శవ రాజకీయాలు చేయడం కాదు: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సేవ చేయడం అంటే శవ రాజకీయాలు చేసినట్లు కాదని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. బ్రిటీషర్ల తర్వాత దేశంలో అదే రీతిలో వనరుల దోపిడీ చేసిన దోపిడీదారుడు వైఎస్ జగన్ అని ఆరోపించారు. ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మాజీ సీఎం వైఎస్ జగన్, వైసీపీపై విమర్శలు చేశారు. ఇసుక, మట్టి అక్రమ మైనింగ్ చేసి పకృతి వనరులను ధ్వంసం చేసిన వైసీపీ నేతలు... చివరకు బుడమేరు గట్ల నుంచి కూడా మట్టి, ఇసుక దోపిడీ చేశారని... పర్యవసానంగా ఇప్పుడు విజయవాడలో లక్షల మంది సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆపదలో ఉన్న ప్రజలకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సహాయం చేస్తుంటే .. లండన్ కి బట్టలు సర్దుకుని కూర్చున్న వైఎస్ జగన్... సోషల్ మీడియా పోస్టులు పెట్టుకుని పబ్బం గడుపుతున్నాడని విమర్శించారు. విజయవాడ సితార జంక్షన్ లో వరద ముంపు ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్న సిబ్బందికి ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్ బాబు, ఏపీ జెన్‌కో సీఎండీ చక్రధర్ బాబుతో కలిసి సూచనలు చేసినట్లు తెలిపారు.

చదువు కోసం చిన్నారుల పాట్లు

విశాలాంధ్ర-చింతపల్లి (అల్లూరి జిల్లా): మన్య ప్రాంత అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేస్తున్నా మని పాలకులు, ప్రజా ప్రతి నిధులు ప్రకటనలు గుప్పించడం మినహా అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలో విద్యార్థులు వర్షాకాలం పాఠశాలలకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సాహసం చేయాల్సిందే. వర్షా కాలం పొంగిపొర్లే కాలువలను దాటి పాఠశాలలకు వెళ్లాల్లి వస్తోంది. చిన్నారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా కాలువలో కొట్టుకుపోయే ప్రమాదం ఉంటుంది. కిటుముల పంచాయతీ శీకాయబంద గ్రామ విద్యార్థులు కొత్త వీధికి, పాత వీధికి మధ్యలో ఉన్న పెద్ద కాలువను దాటి వెళ్లాలి. కొత్త వీధి ఎంపీపీ స్కూల్లో 72 మంది చిన్నారులు చదువుతున్నారు. వర్షాకాలం, అల్పపీడన ప్రభావ సమయాలలో వీరంతా మోకాటి లోతుపైగా నీటిలో కాలువ దాటాలి. పిల్లలు తిరిగి వచ్చేవరకు తల్లిదండ్రులు తమ బిక్కు బిక్కు మంటూ ఎదురుచూస్తున్నారు. ఈ పంచాయతీ లోనే గాక మండలంలోని వివిధ పంచాయతీలలో ఇదే పరిస్థితి నెలకొంది. విద్యార్థులకే గాక, గర్భిణులు, రోగులకు కూడా ఇటువంటి అనుభవాలు ఎన్నో ఉన్నాయి. కనీసం వాగులపై వంతెనలు నిర్మించేందుకు పాలకులకు మనసు రావడం లేదని మారుమూల ప్రాంత గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మన్య ప్రాంతంలో వంతెనల నిర్మాణాలకు శ్రీకారం చుట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

నయాగరా కవి బెల్లంకొండ సాహిత్యం

సాహితి

పెనుగొండ లక్ష్మీనారాయణ, 9440248778
అధ్యక్షులు, అరసం జాతీయ సమితి

బెల్లంకొండ రామదాసు నయాగరా కవిగా తెలుగు సాహిత్యలోకంలో ప్రసిద్ధులు. గొప్ప సాంస్కృతికవారసత్వం కలిగిన కుటుంబంనుంచి వచ్చి వెలుగొందిన సాహితీవేత్త. వీరి సాహితీ నేపథ్యం విశిష్టమైనది. వీరి పూర్వీకులు బెల్లంకొండ రామరాయ కవి ప్రమిడిపాడు, (1875-1914) పండితుడు, అనేక రచనలు చేశారు. వీరి తండ్రి బెల్లంకొండ రాఘవరావు (1899-1972). వీరి స్వగ్రామం నరసరావుపేట మండలంలోని పమిడిపాడు. వీరు వెయ్యి ఎకరాల జమీందారు, వితరణశీలి. సంస్కృతాంధ్ర భాషలలో పాండిత్యం సంపాదించిన వ్యక్తి. వీరి యింట జరిగే సాహిత్య, రాజకీయ గోష్ఠులలో విశ్వనాథ సత్యనారాయణ, నాయని సుబ్బారావు, అడివి బాపిరాజు, కోలవెన్ను రామకోటేశ్వరరావు, టంగుటూరి ప్రకాశంపంతులు వంటి ప్రసిద్ధులెందరో పాల్గొనేవారు. గ్రంథాలయోద్యమం అనే మాట వినబడని రోజులలో రాఘవరావు గ్రంథాలయాల స్థాపనకు ఎనలేని కృషి చేశారు. వీరి శ్రీమతి కనకమ్మ కూడా సంస్కృతాంధ్ర భాషలందు పండితురాలు, సాహిత్యాభిలాషి. ఈ దంపతులకు రామదాసు 23 ఆగస్టు 1923 న జన్మించారు. రామదాసు విజయవాడలో ఇంటర్మీడియట్ చదువుతూ మధ్యలోనే చదువుకు స్వస్తి పలికారు. రామదాసు స్వయంకృషితో ఆంధ్రాంగ్ల భాషలలో విశేష సాహిత్యం సాధించారు. ఇందుకు వారి అనువాదాలు, కవిత్వరచన నిదర్శనం. రామదాసు హైదరాబాద్‌లో ఆంధ్రప్రభ దినపత్రికలో ఉప సంపాదకునిగా పనిచేస్తూ 19 సెప్టెంబరు 1969 న 46 సంవత్సరాల వయసులో మృతి చెందారు. రాఘవరావు తన కుమారుడు రామదాసు మృతి వలన కలిగిన మనోవ్యథతో 1972లో హైదరాబాదులో తనువు చాలించారు.

బెల్లంకొండ రామదాసు నవ్య కళాపరిషత్తు: తన గ్రామం పమిడిపాడుకు సమీప పట్టణమైన నరసరావుపేటలోని కవులు, సాహిత్యాభిమానులతో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకున్నారు. తెలుగు భాష, సాహిత్య వివాదాలు, ఉద్యమాలు రకరకాల సంస్థల స్థాపనకు దారితీస్తున్న తరుణంలో 1911 లో కాకినాడలో సంప్రదాయ ప్రయోజన పరిరక్షణార్థం ఏర్పాటైన ఆంధ్ర సాహిత్య పరిషత్తుకు పోటీగా భావ కవిత్వ, ఆధునిక సాహిత్య వికాసానికి వేదికగా తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి అధ్యక్షతన 1936లో నవ్య సాహిత్య పరిషత్తు ఏర్పడింది. నవ్య సాహిత్య పరిషత్తుకు పోటీగా 1939 లో అభ్యుదయ భావజాలంతో నరసరావుపేటలో నవ్య కళాపరిషత్తు ఏర్పడింది. ఇందులో బెల్లంకొండ రామదాసు క్రియాశీలంగా వ్యవహరించారు. నవ్య కళాపరిషత్తుకు చెందిన బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం మార్చి 1944 లో నయాగరా కవితా సంకలనాన్ని వెలువరించారు. నయాగరా వెలువడే నాటికి నవ్య సాహిత్య పరిషత్తు వారు రాసేది 'నవ్య కవిత్వం' అని ప్రచారం చేస్తుంటే నయాగరా కవులు తాము రాసేది 'అతి నవ్యకవిత్వం' అన్నారు. సంకలనం చివరిఅట్టపైన అభ్యుదయాన్ని సూచిస్తూ 'నయాగరా-ఎన్ ఏంథాలజీ ఆఫ్ ప్రోగ్రెసివ్ పొయిట్రీ' అని అచ్చేశారు. నయాగరా కవులకు మార్గదర్శి, కమ్యూనిస్టు నేత, అభ్యుదయ రచయిత పులుపుల వెంకటశివయ్య. వీరితోపాటు నవ్య కళాపరిషత్తు సభ్యులు 'యవ్వనంలో పులుపుల వెంకట శివయ్యగారి రహస్య కమ్యూనిస్టు పాఠాల బోధనల వల్ల ప్రభావితులు' అన్న ఆరుద్ర మాటలు చారిత్రక సత్యం.

రామదాసు గురించి, రామదాసు సాహిత్యాన్ని గురించి విజ్ఞాన సర్వస్వము తెలుగు సంస్కృతి 2 వ భాగంలో యిలా రాశారు. "రామదాసు మొదట శివ భక్తుడు. తరువాత కొన్నాళ్లు కృష్ణ ప్రేమను అలవరచుకొనెను. చివరకు సామ్య వాది అయి, తిరుగుబాటుకవులలో ప్రముఖుడయ్యెను." తెలుగు సాహిత్య కోశం- ఆధునిక సాహిత్యం (1851- 1950) లో ఏమి రాశారంటే: "అధర్మనిలయమైన లోకాన్ని దహించాలన్న ఆవేశం వీరిరచనలలో కనిపిస్తుంది. అలంకారాలు, శైలి, పదబంధాలు కవిత్వానికి శత్రువులనీ, ధర్మయుద్ధంలో ఆహుతి అయ్యే అనేక జీవాల అరుపుల చప్పుడే కవిత్వమని చెప్పిన వీరు"- సమస్యా పరిష్కారాన్ని సూచించే సామ్యవాద వాస్తవికత వీరి రచనలలో ఉంది" అని.

కవిత్వంపై రామదాసు అభిప్రాయం: 1953 లో చేతన సాహితి ప్రచురించిన 'కల్పన' కవితా సంకలనానికి సంపాదకులు అనిసెట్టి సుబ్బారావు, అవసరాల సూర్యారావు, బెల్లంకొండ రామదాసు, రెంటాల గోపాలకృష్ణ. ఈ సంకలనాన్ని అక్టోబర్ 2008 లో విశాలాంధ్ర పునర్ముద్రించింది. ఈ సంకలనంలో 'చింతన' శీర్షికన కవిత్వం గురించి నలుగురు సంపాదకులు గొలుసుకట్టు రీతిలో తమ అభిప్రాయాలను ప్రకటించారు. బెల్లంకొండ రామదాసు అభిప్రాయం: "ఈ యుగాన్ని ఆవరించిన ప్రధాన తత్వదృష్టి మార్క్సిజం. నేటి సాంఘిక విషబంధంలో చిక్కిన మానవునికి మార్క్సిజం గొప్ప నిష్కృతి మార్గంగా కనిపించింది. అందుచేత, వివిధ అంతర్వైరుధ్యాలతో సంఘర్షితమౌతున్న సంఘ సంగీతం ఈ యుగంలోని కవితలో వినిపిస్తుంది". ఈ మాటలు రామదాసులో నెలకొన్న స్పష్టమైన మార్క్సిజం భావజాలాన్ని తెలుపుతున్నాయి.

రామదాసు కవిత్వం-కుందుర్తి: ఇంతటి ప్రతిభావంతుడైన రామదాసు కవిత్వం నేడు ఎక్కువగా దొరకటం లేదు. వీరు 1940లో 'శ్మశానం' కావ్యం రాశారు. ఎంత ప్రయత్నంచేసినా అలభ్యం. "రామదాసు కవిత్వ చర్యను గురించి కుందుర్తి తన 'బతుకుమాట' (అసంపూర్తి ఆత్మకథ- డిసెంబర్ 1989) లో రాసిన ఈ మాటలను ఇప్పుడు గుర్తుచేయటం అవసరమని భావిస్తున్నా". రామదాసు అచ్చువేసిన కవిత్వం ఇప్పుడు మనకు మిగిలింది చాలాకొద్ది. అయితే రాసి చించి పారవేసిన కవిత్వం బోలెడుంది. దాసుకు ఒక స్థిరత్వం లేదు. అతనికి ఏ ధ్యాస కలిగితే అదే ధ్యాస. రాధాకృష్ణుల ప్రేమ తత్వాన్ని గురించి గేయం రాస్తాడు. రోజూ చదివి వినిపిస్తాడు. పది రోజుల తర్వాత "ఏవీ ఆ గేయాలు మళ్లీ ఒకసారిచదువు" అంటే, అంతకు ముందు రాత్రే అవన్నీ చించివేశానంటాడు. రాసినగేయం చించివేయడం సరే, పొరపాటున పోయిందంటేనే నాకు మహా చిరాకు. రామదాసు వందల గేయాల్ని, అవలీలగా నిర్దాక్షిణ్యంగా చించివేస్తాడు"- ఇప్పుడు అర్థమైంది కదా రామదాసు కవిత్వం దొరకకపోవటానికి కారణం.

రామదాసు కవిత్వం: ఈ పరిస్థితులలో ఎనిమిది కవితలు నాకు లభించాయి. అవి నయాగరా సంకలనంలోని మూడుకవితలు నా గీతం, ఈ రోజున, చెరసాల, కల్పన కవితా సంకలనంలోని అశోకవృక్షం, అబ్బూరి ఛాయాదేవి సంకలనం చేసిన కవిత-1 లోని నిష్క్రమణం, ఏటుకూరి ప్రసిద్, యామిజాల ఆనంద్ సంకలనం చేసిన పొయిట్రీ వర్క్‌షాప్‌లోని అమ్మనడిగిన ఆఖరు ప్రశ్న. ఇవి నా గృహగ్రంథాలయంలో దొరికినవి. మరియూ సోదరుడు, యువ సాహితీ వేత్త బత్తుల అనిల్‌రెడ్డి ద్వారా త్రిపుట, తాగుతాగు చెల్లెలా కవితలు లభించాయి.

రామదాసు కవితలు- నయాగరా: నయాగరా సంకలనంలోని కవితల గురించి: "మానవ మేధస్సుకు/ సంకెళ్లను/ తగిలించిన/ గత సాంఘిక/ శిలా శాసనం/ పడగొట్టను/ పగిలిన నా నిప్పుల కంఠం/ పలికిన విప్లవగీతం, జగత్తునొక/ నయాగరా/ జలధారలుగా/ వర్షించిన/ నా గీతం; యుగాల నుంచీ/ నడిచే/ నియమపు రైళ్లకు/ పట్టాలను/ పీకేసిన/ నా గీతం- వర్గ రహిత/ సంఘ స్వర్గానికి పూల నిచ్చెనలు/ వేసిందట... నా గీతం" అని రామదాసు గతాన్ని, గత నియమాలను తిరస్కరిస్తూ వర్గరహిత వ్యవస్థను ఆకాంక్షించారు. 'నా గీతం' లో. "పసిఫిక్ రంగంలో బర్మా అడవుల్లో మాస్కో గేట్లల్లో పారిస్ వీధుల్లో లండన్‌లో వాషింగ్‌టన్‌లో ఇటలీలో బెర్లిన్ చైనా లోయల్లో పృథ్వీ గర్భంలో ప్రతి అణువూ ప్రసవించిన యుద్ధాగ్నులు మీ కోసం!" అంటూ 'ఈ రోజున' కవితలో విశ్వదర్శనం చేస్తూ "భవిష్యత్తు మిమ్మల్నే స్వయంవరం చేస్తున్నది! మీ మెళ్లో పూలమాల వేస్తున్నది! మీ కళ్యాణానికి రణ ధనుస్సు విరిగిందీ రోజున!" అని 'ఈ రోజున' కవితను ఆశావహ దృష్టితో ఆలపించారు.

"ఇన్నాళ్లూ సమాజం ఒక సంకెళ్ల చెరసాల! హత్యలు జరిగిన చెరసాల! నెత్తురు పారిన చెరసాల! దుర్మార్గులు కట్టిన చెరసాల! ఒక పెద్ద చెరసాల!"- "పూజారుల అధికారం రాజన్యుల నియంతృత్వం కట్టిన పెద్ద జైలు కొట్టు చేసిన మహా హత్య ఇదే కదా పూర్వపు సమాజ చరిత్ర యంతా!" ఈ వ్యవస్థ స్వరూప స్వభావాలను విడమర్చి చూపుతూ, చెరసాలగా మారిన ఈ సమాజాన్ని పగలగొట్టటానికి ఎర్రజెండాను ఆశ్రయించారు.

"మీకై ఈనాడొక అరుణపతాకం ఎగురుతోంది చూచారా! మీకై ఈనాడొక నవజగత్తు ప్రభవిస్తున్నది చూశారా!" అని 'చెరసాల' కవితలో రామదాసు తన స్వప్నాల్ని ఆవిష్కరించారు. "చెరసాల" కవిత శ్రీశ్రీ 'దేశ చరిత్రలు' గేయం ప్రభావధోరణిలో రాశారని ఏల్చూరి మురళీధరరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. నయాగరా సంకలనంలోని మూడు కవితలను రామదాసు జనవరి 1944 లో రాశారు. ఈ మూడు కవితల్లోనూ కమ్యూనిజం స్ఫూర్తి స్పష్టమైంది.

నయాగరా ఆవిష్కరణ: నయాగరా కవితాసంకలనం ఆవిష్కరణ గుంటూరులోని లీలామహల్లో (కుందుర్తి సరస్వతీ మహల్లో అన్నారు, కానీ అది సరైనది కాదు) 1944 ఆగస్టు 6 న జరిగింది. కవి సమ్రాట్ విశ్వనాథసత్యనారాయణ ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొంటూ వేదిక నుంచి 'ఇది నా శిష్యుల సభ', ఇదొక కొత్తరకం రచన, మీరంతా విని వీళ్లని ఆశీర్వదించాలి' అని శ్రోతలను కోరారు.

నయాగరా కవిత్రయంలో చిన్నవాడైన రామదాసు తొలుత తన కవితలను వినిపించారు. 'నా గీతం' కవితను చదివేప్పుడు ప్రారంభ పంక్తులను వినిపిస్తుండగానే అది కమ్యూనిస్టు పార్టీ ప్రచారమని శ్రోతలలో కొంత అల్లరి చెలరేగింది. వీటిని లెక్క చేయకుండా రామదాసు తన కవితను బలంగా వినిపించారు. రామదాసు కవిత వినిపిస్తున్నప్పుడు 'తన ప్రాణమిత్రుడు బెల్లంకొండ రాఘవరావుగారి కొడుకు కవితాగానమని విశ్వనాథ అమిత శ్రద్ధతో విన్నారు' అని ఏల్చూరి మురళీధరరావు తన 'నయాగరా' ఆవిష్కరణ స్మరణోత్సవం' వ్యాసంలో వివరించారు. మార్చి 1944 లో ప్రథమ ముద్రణ పొందిన 'నయాగరా'ను 31 సంవత్సరాల అనంతరం మార్చి 1975 లో కుందుర్తి ఫ్రీవర్స్ ఫ్రంట్ ఆధ్వర్యాన ద్వితీయ ముద్రణ గావించారు. 'నవ్య కవితాఝరి' 'నయాగరా' ఏ 75 శీర్షికన నేను రాసిన వ్యాసం విశాలాంధ్ర దినపత్రికలో 18 మార్చి 2019 న ప్రచురితమైనది. ఇప్పుడు నయాగరా సంకలనానికి ఎనభై సంవత్సరాలు నిండిన సందర్భంలో అందులో ఒకరైన బెల్లంకొండ రామదాసు సాహిత్యాన్ని గురించి మాట్లాడే అవకాశం లభించినందుకు సంతోషిస్తున్నాను.

రామదాసు ఇతర కవితలు గురించి: మళ్లీ రామదాసు మిగిలిన కవితల గురించి మీతో ముచ్చటిస్తాను. "బ్రతుకొక అశోక వృక్షం/ ప్రపంచమొక లంకానగరం/ నేను సీతను! జీవిత వృక్షచ్ఛాయలో/ కూర్చున్నా / నాచుట్టూ/ బాధిస్తు దానవులు- మానవులు!/ నేను సీతను!/ జీవితాశోక వృక్షచ్ఛాయలో/ హనుమంతుని రాక ఎదురుచూస్తూ!/ లంకా దహనం ఎదురు చూస్తూ!/ బ్రతుకే ఒక క్రాస్!/ మనిషే ఒక క్రైస్ట్!". ఈ కవితలోనూ ఇంతకు ముందు చర్చించిన కవితల్లోని సారాంశం ఈ చిన్న కవితలో కనిపిస్తుంది. ప్రపంచంలో, దేశంలో, సమాజంలో ఒక మంచి పరిణామం కోసం ఎదురుచూస్తున్నట్లు అందుకు దుష్ట దానవ, మానవ పరిహారం కోసం ఎదురుచూస్తున్నట్లు కవి హృదయం తెలియజేస్తోంది. ఈ కవితలోని రెండవ విభాగంలోని రెండు చరణాలు మానవ జీవన వేదనను అధి వాస్తవిక ధోరణిలో వ్యక్తీకరించారు.

"ఎన్నో దినాలు గడిపాను మీ మధ్య/ఎన్నో దినాలు నడిచాను ఈరథ్య/ వెడతాను మరి, సెలవు.-/భూత కాల భూతశాల వదలి/వర్తమాన విష వర్తులాన్ని భేదించుకుని/భావికాలపు నల్లని ముసుగు ధరించి/వెడతాను మరి. సెలవు...-/నాకు లోకం లేదు నాకు శోకం లేదు/నాకు బంధం లేదు, నాకు బాధలు లేవు/ఏదో చల్లనైంది నాలో నేడు/ఏదో ఎన్నడో మరిచింది/జ్ఞాపకం వస్తోంది /వెడతాను మరి, సెలవు./వినిపెంచె నేదో మెల్లని పిలుపు./మూయండి నా వెనుక విశ్వపు తలుపు" - ఎంతో నిరాశా నిస్పృహలతో ఈ లోకం నుంచి 'నిష్క్రమణ' చెందటాన్ని ఆవిష్కరించినదీ కవిత. ఇది రామదాసు వైయక్తిక దృష్టితో రాసినది.

జీవితంలోని నిన్న, నేడు, రేపులతో కూడిన మూడుపేజీలను చిత్రించిన కవిత 'త్రిపుట'. ఈ కవిత మూడు సామాజికదృశ్యాలను మనకు ఆవిష్కరించింది.

'నిరుడు మనం కలుసుకున్న రోజుల్లో/నింగి నిశ్చలంగా ఉండేది/నిప్పు మండుతూ ఉండేది/నీతి నిండుగా ఉండేది'... ఇది 'నిన్న'టి దృశ్యం.

'నేడు మనం కలుసుకున్న క్షణంలో/రణం, భయం, భ్రాంతి దాగి ఉంది అశాంతి అంబరం నిండా మూగి ఉంది/ఆకాశం అలసిన వేశ్యలాగ వెల్లకిలా పడుకుంది'- ఇది నేటి దృశ్యం.

'రేపు మనం కలుసుకోం బహుశా/బహుశా ఏమిటి?
బహుశా నిశ్చయంగా!/నేను వెడుతున్నాను
నిరుత్తరంగా నిల్చున్న నింగిలోకి
నిశ్చల నిశ్శబ్దంలోకి /నిరాశలోకి, నిరీహలోకి
నిప్పులేని తప్పులోకి/పాడుబడిన గుడిలోకి
నిశీథం పైట చెరుగులోకి' - ఇలా 'నేను' అనే వ్యక్తి చీకటిలోకి వెడితే
'నీవు వెడతావు గుడిసెలోకి /సులకమంచం వాల్చుకుంటావు
గుడ్డి దీపం వెలిగిస్తావు'... అని! 'రేపు' చిత్రాన్ని గీశారు. ఆశా, నిరాశలు, అధివాస్తవికతా ధోరణితో నిండిన ఈ కవిత రచనాకాలం 1954.

'ఏ తనయుడూ ఏనాడూ జననిని అడగని,

అడగలేని మహా ప్రశ్నను 'అమ్మ నడిగిన ఆఖరి ప్రశ్న' కవితలో అడిగారు. 'జనన మరణాల్ పూర్వం/ చల్లని పరమానంద/ జలధింగ చిరుచేపనై తిరిగే నన్ను/ ఎందుకు నీ గర్భంలో వల వేశావు నాకు? ఎందుకు/ నీ గర్భంలో ఉరి తీశావు నన్ను? అమ్మా చెప్పు'- నన్నెందుకు కన్నావు అనే అసాధారణ ప్రశ్నను తల్లి ముందు సంధించిన తనయుని కథ ఇది. ఈ కవితను రామదాసు చేతి రాతతో సంపాదకులు ప్రచురించారు.

'తాగు తాగు చెల్లెలా!' కవితను పరిచయం చేస్తాను.

"ఇట తిరిగిన వెన్నో విషాద వసంత చక్రాలు
ఇట కరిగిన వెన్నో మానవాళి మలిన పాదాలు
వెర్రిగా వీచినవి మారుతాలు ఏడ్చినవి రుతాలు
కదిలినవి సైన్యాలు మెదిలినవి దైన్యాలు
మూల్గినవి లోకాలు కాలినవి కాలాలు
జరిగినవి హవనాలు నవనాలు కవనాలు
ఇది విధి వేశ్య నిదురించు విధుర శయ్య
ఇట లేదు జీవి! ఇట లేదు పూవు!
ఇది మహా భయద చరమ స్మశాన స్థలి"- ఈ కవితా వాదాల వలన మీకు అర్థమై ఉంటుంది. ఇదంతా శ్మశానం గురించే అని. ఈ ఖండిక శ్మశానం కావ్యంలోనిది. ఈ ఖండికను రామదాసును పరిచయం చేస్తూ ఆరుద్ర తన సమగ్రాంధ్ర సాహిత్యంలో ఇచ్చారు.

ఈ శ్మశానం కావ్యం గురించి! "ఈతని శ్మశానం (1940) కావ్యము రసజ్ఞులలో పెక్కు ఆశలు రేకెత్తించెను" అని విజ్ఞాన సర్వస్వం-2 లో పేర్కొనటం జరిగింది. కుందుర్తి ఇలా అన్నారు. "మా రామదాసు కూడా 'శ్మశానం' అనే పేరుతో ఒక చిన్న పుస్తకం ప్రకటించాడు. అందులో బీభత్సం విలయతాండవం చేసింది". ఈ పుస్తకం గురించి ఏల్చూరి మురళీధరరావు (నయాగరా కవి ఏల్చూరి సుబ్రహ్మణ్యంగారి కుమారుడు) ను అడగగా అది రామదాసుగారి అబ్బాయి దగ్గర కూడా లేదని చెప్పారు.

ఇతర ప్రక్రియలలో రామదాసు కృషి: బెల్లంకొండ రామదాసు కవిత్వం, నాటకం, అనువాద ప్రక్రియలలో విశిష్ట కృషి చేశారు. వీరు పునర్జన్మ, అతిథి, ఈరోజున నాగతం, మాస్టర్జీ మొదలగు నాటకాలు, నాటికలు రచించారు. రవీంద్రనాథ్‌టాగోర్ గీతాంజలిని, టాల్‌స్టాయ్ కథలనూ అనువదించారు. ఇంకా గోర్కి, బాల్జాక్, మపాసా, ఎమిలీజోలా, చార్లెస్ డికెన్స్, లెర్మంతోవ్ వంటి ప్రపంచ ప్రముఖ రచయితల ప్రసిద్ధ నవలలను అందించారు. రెంటాల గోపాలకృష్ణతో కలిసి టాల్‌స్టాయ్ యుద్ధం- శాంతి నవల మూడు భాగాలను, నన్నపనేని సుబ్బారావుతో కలిసి టాగోర్ కథలను 'పరిత్యాగము' పేరుతో అనువదించారు. జీవితము- మతము శీర్షికన టాల్‌స్టాయ్ వ్యాసాలను అందించారు. అనువాద ప్రక్రియలో నయాగరా కవులు ముగ్గురూ దిట్టలు. అందులో రామదాసుది పైచేయి. వీరు అనువాద రచయితగా తెలుగు సాహిత్య లోకానికి బాగా పరిచితులు. కథానికలూ రాశారు. వీరి అనువాద నవలలు అనేకసార్లు పునర్ముద్రణలు పొందాయి. చలనచిత్రరంగంలో రచయితగా, సహాయ దర్శకుడిగా కూడా పనిచేశారు.

ముగింపు: నయాగరా కవిగా, కావ్యకర్తగా, కార్యకర్తగా చేసిన కృషి ద్వారా తెలుగు సాహిత్య లోకంలో చిరంజీవి బెల్లంకొండ రామదాసు. అభ్యుదయ సాహిత్యోద్యమంలో, అభ్యుదయ రచయితల సంఘంలో విలువైన కృషి చేసిన బెల్లంకొండ రామదాసుకు వారి వారసునిగా అభ్యుదయ రచయితల సంఘం పక్షాన జోహార్లు అర్పిస్తున్నాను.

బెల్లంకొండ రామదాసు సాహిత్యక్షేత్రం అయిన నరసరావుపేటలో జరుగుతున్న వారి శతజయంతి సభలో నన్ను భాగస్వామిని చేసినందుకు సాహిత్య అకాడెమీకి, పల్నాడు కళాక్షేత్రం కార్యవర్గానికి కృతజ్ఞతలు.

(నరసరావుపేటలో 25-8-2024 న జరిగిన బెల్లంకొండ రామదాసు శతజయంతి సభలో సమర్పించిన ప్రసంగ పత్రం)

హితవు

**పరవళ్ళు తొక్కింది అదేదో ప్రకోపం కాదు
అది ప్రకృతి ప్రతాపం అవును మరి
సమస్త తలాల్నీ ఆక్రమించే
మనిషి తనానికిదో హెచ్చరిక**

**భూమాత హృదిలో ఆమె ఒడిలో
ఎదిగిన మనిషి ఆ ఎదపైనే తన్నిన
పాపపు పాదముద్రల
కడిగేసే ఆకాశ గంగా ధారలవి**

**ఏదీ శాశ్వతం కాని ప్రకృతిలో
మనిషి మాత్రం శాశ్వతం అనుకోకు**

**అశాశ్వత జీవితానికి
శాశ్వత ఆస్తులుంటాయా!?**

**లేనిదేదో ఉందంటూ
ఉండాల్సింది వదిలేసుకొని**

**ఏమి చూస్తావు?
ఏమి చేస్తావు?
గుళ్ళుగోపురాలకెళతావు
ప్రార్థనా మందిరాలకెళతావు
పూజలూ ప్రార్థనలూ
యజ్ఞయాగాదులు చేస్తావు**

**వాటన్నింటి ఆశ ఆకాంక్షల మూలం
సర్వమానవ కల్యాణమనే
భావననే నిర్లక్ష్యం చేస్తావు అంతలోనే
సర్వంస్వాహా చక్రవర్తినంటావు**

**తన అస్తిత్వానికి తానే
చరమగీతి పాడుకొనే మనిషి**

**అజ్ఞాన తిమిరాల కరిగించే
జ్ఞాన వర్షపాతాలవి**

**ఆదిమధ్యాంతాలు లేని చిత్ర విచిత్ర విశ్వంలో
స్వయంకృతాపరాధాలతో ఇంతలోనే
లయమవ్వొద్దనే కరుణామయి
ప్రకృతి మాత ముందస్తు హితవిది**

**అందుకే కుచ్చితాలు వద్దు కుతంత్రాలు వద్దు
కుళ్ళు రాజకీయాలు అసలే వద్దు
కళ్ళు తెరవండి ఇకనైనా
ఒళ్ళు ఎరగండి ఇకపైన**

- కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ

మనిషిలో మనిషిని పరిచయం చేసే కవితాసంపుటి

ఆయన కవిత్వం చదువుతుంటే మనకుతెలియని మనల్ని పరిచయం చేసినట్టుంటుంది. మరో వైపు చుట్టూఉన్న సమాజపోకడలను తెలుపుతూ ఆలోచించమంటుంది. ఆ కవిత్వం సృష్టికర్తే డా.ఎన్. గోపి.గారు. ఆయన అమృతోత్సవం సందర్భంగా 75 కవితల సమాహారంగా సాహితీప్రియులకు అందించిన కవితాసంపుటే 'రేపటి మైదానం.'

ఇందులో ఈ కవితాసంపుటికి శీర్షికైన 'రేపటి మైదానం' తొలికవితగా మొదలై 'సారాంశ్' వరకు సమాజంలో జరిగే కనిపించే సమస్యలతోపాటు మనిషి తనలో తాను, తనతో తాను పడే ఇబ్బందిని అక్షరబద్ధం చేశారు. ముందుగా తొలికవిత 'రేపటి మైదానం'లో 'ఆటలాడే పిల్లలు/భూమిలోంచి డైరెక్టుగా/పూచిన పువ్వుల్లా ఉన్నారు/గ్రౌండ్‌కు ప్రాణమొచ్చింది/ స్తబ్దంలోంచి శబ్దం చిగురించింది..' పిల్లల్ని పువ్వులతో పోల్చి వారిరాక గ్రౌండ్‌కే ప్రాణమొచ్చిం దని చెబుతూ ఈ మైదానంలో చిట్టి ఆటగాడు జావెలిన్‌త్రో విసిరితే అది కాలాన్ని చీల్చుకుంటూ ఇంకా ప్రయాణిస్తూనే ఉందని, ఎన్.సి.సి. క్యాడెట్స్ కవాతు దేశం యుద్ధానికి సిద్ధమైనట్లుందంటారు. మైదానమంటే కేవలం ఆటలాడుకునే ఖాళీదికాదు అది చరిత్రను కడుపులో దాచుకున్న జ్ఞాపకాల పురాస్థలమని చెబుతూ దానిపై కనిపించిన మేఘశకలాలు కదలకుండా తన కవిత్వంలో చోటుకోసం చూస్తున్నాయని చెబుతూ మైదానమంటే జీవన రంగస్థలమంటారు రచయిత.

నేడు పుస్తకాలుచదవడం అన్నది తగ్గిపోతున్నది. టెక్నాలజీతో వచ్చిన సౌకర్యం అది. పుస్తకాలు జ్ఞాన నదులని పేర్కొంటూ 'కంప్యూటర్ కొండచిలువ/ పుస్తకాన్ని కాస్త కాస్త మింగుతున్నది...' అని సాంకేతిక పరిజ్ఞానం అందించిన కంప్యూటర్ కొండచిలువ రూపంలో పుస్తకాన్ని మింగేస్తోంద'ంటారు. మధ్యలో 'ఇ-బుక్ చదువుతావా' అన్న ప్రశ్నకు మనసులో ఆజ్యం పోసినట్లయింది. గతంలో చాలామందికి గుండెమీద పుస్తకం అనించుకుంటేకాని నిద్రపట్టదు. ఎన్నో అనుభూతులను, తియ్యటి అనుబంధాలను పంచే వేలపుస్తకాలు చదవడం వల్ల శుక్లాలు వచ్చాయని, అయితే 'కనులు అలసిపోయినై గాని/ అంతర్నేత్రానికి మాత్రం అవి తాజాదృశ్యాలే'నని, 'మార్పు అనివార్యమే కావచ్చు/ కాని అది విధ్వంసమై విరుచుకుపడితే/ కాలం చెప్పే తీర్పు అన్యాయ మవుతుంది..' అంటారు కవి. అంతేకాదు టెక్నాలజీ వల్ల పుస్తకాలు చదవడం కనుమరుగైపోతుందేమోనన్న అనుమానం..అదికూడా ఎంతగా అంటే పుస్తకాలను నిత్యం చదివేవారు 'మీరేమను కున్నా పరవాలేదు/ నా చితిపైన మాత్రం/ ఓ పుస్తకం పెట్టడం మరచిపోకండి.' అనేంతగా పుస్తకం విలువను తెలుపుతారు రచయిత 'జ్ఞాన నదులు' కవితలో.



రేపటి మైదానం (కవితాసంపుటి)
-డా.ఎన్. గోపి
పేజీలు:164, వెల: రూ.200/-
ప్రతులకు: ఎన్. అరుణ, హౌస్ నం.13-1/బి,
శ్రీనివాసపురం, రామంతపూర్
హైదరాబాద్-500013.
ఫోన్: 9391028496 మరియు అన్ని
ప్రముఖ పుస్తక విక్రయకేంద్రాల్లో

'గ్రంథోపనిషత్' కవితలో జ్ఞానాన్ని అందించే పుస్తకాలు తోడుంటే, వాటిని చదువుతుంటే అంతకుమించిన ఆనందం, ఐశ్వర్యం మనసుకుండదంటారు. ధనిక, పేద అన్న భేదంలేదు ఆకలికి. ఆకలి ఎవరికైనా ఒక్కటే. మనుషుల్ని కలపడంలో ఆకలి సాయం చేస్తుంది. 'ఆకలి మనిషంత పాతది/ ఆదరణతప్ప దాని చుట్టూ దైన్యం ఉండరాదు/ అవమానం అసలేకూడదు/ దేవునికన్నా ఆకలి మహత్తరం/ దానిని మిగుల గౌరవించాలి...' అని ఆకలి విలువను గుర్తించమంటారు. ఆకలితో ఇంటికివచ్చిన వారికైనా, అలమటించే వారికైనా అన్నంపెట్టి వారిని సంతృప్తిపరిస్తే 'ఆ తృప్తిలోంచి/ వెలువడుతుంది ఒక అనిర్వచనీయదీప్తి' అంటారు. అంతేకాదు ఆకలి లేనప్పుడు తినటం నేరం. ఆ పనిచేయవద్దని, 'ఆకలి ప్రపంచ చక్రానికి ఇరుసు/ క్రియా జన్య ప్రక్రియలోని సొగసు' గా ఆకలి స్వరూపాన్ని అక్షరబద్ధం చేస్తారు 'ఆకలి' కవితలో.

'నది దుఃఖిస్తుంది' కవితలో మనిషి తనకు జీవనాధారమైన నదులను కలుషితం చేసుకుంటూ తనను తానే మరుగునపడేసుకుంటున్నాడు. మనిషి చేసే పనులకు నదులు దుఃఖిస్తున్నాయని, వాటి గొప్పతనాన్ని గుర్తించి సంరక్షించుకోవాలంటారు. 'గంగా! ఇతిహాసిక తరంగా!/మూసీ! నా బాల్య ప్రేయసీ!/అంటూ 'నదితో పాటు/దుఃఖించాలని ఉంది/ నా కన్నీళ్లతో మరోసారి/ క్షాళనకావ్యం రచించాలని ఉంద'ంటారు. ఇకనైనా వాస్తవాన్ని గుర్తించి నదులను కలుషితం చేయవద్దంటారు.

'పోతేపోయింది యవ్వనం/జీవితం మైదానంలోకి ప్రవేశించింది/ ఇప్పుడు హృదయం అవికార శోభితం..' అని యవ్వనం గురించి చెబుతూ 'ఒకప్పుడు పొగరు దానికి చుట్టం/ అతి విశ్వాసం అనుంగు నేస్తం/ కాలర్ ఎగరేసే ఉడుకు రక్తం దాని సమస్తం..' అని యవ్వనం తీరును నాలుగులైనల్లో పరిచయం చేస్తారు. అటువంటి యవ్వనం పోయినందుకు నాకు బాధలేదని, దానివల్ల కొంచెం ప్రేమ, కొంచెందయ, కించిత్ త్యాగంతో పాటు మానవత్వం గురించి ఆలోచించే తీరిక దొరికిందంటూ 'పోతే పోయింది యవ్వనం/ ఇప్పుడు ఇంటినిండా/ బహుళసార్థక జీవితం/ నిత్య సారాంశగీతం/ నో రిగ్రెట్స్..' అని జీవితంలోని అనుభవాల సారాన్ని, ముఖ్యమైన యవ్వన, వృద్ధాప్యాన్ని కళ్ళముందుంచుతారు 'సారాంశ్' కవితలో.

ఇలా ప్రతి కవితా జీవితాన్ని, జీవనాన్ని, మనిషిని పరిచయం చేస్తుంది. కాలాలు ఎన్నిమారినా జీవితం విలువలు మారకూడదు. జీవితమైదానంలో మనిషెప్పుడు ఆటగాడే. గెలుపుఓటములకు అతీతంగా ఆఖరివరకు ఆడాల్సిందే. అది జీవనసత్యం.

జె.బి.

గ్రంథ సమీక్ష

మానవ సంబంధాల విలువను తెలిపే నవల

'కల నెరవేరకపోవడం కూడా కొన్నిసార్లు వరం లాంటిదే..!'. ఎంత గొప్ప వాక్యమో కదా! ఇది తెలియకనే కదా నేడు నిరాశ, నిస్పృహలకు బలైపోయిన ఎన్నో జీవితాలను చూస్తున్నాం. అపజయం అనేది మనకు అనుకోకుండా దరిచేరే అదృష్టమని తెలుపుతూ పై వాక్యంతో 'నిరంతర యాత్రికుడు' అనే నవలిక ప్రయాణం మొదలవుతుంది. జీవిత ప్రయాణం ఎలా మొదలయిందో ఎవరికీతెలియదు. కానీ ఆ ప్రయాణంలో ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఎన్నో అద్భుతాలు, అదృష్టాలు, అపజయాలు, ఆనందాలు, సాహసాలు, సాధక బాధకాలు, సంబంధ భాంధవ్యాలు. ఇవన్నీ ఎవరో ఒక్కో మెట్టుగా పేర్చి మనకు ఈ జీవితాన్ని ప్రసాదించినట్టు అనిపిస్తోంది కదా! అలా గడిచిన తన జీవితంలోకి ఒకసారి తొంగి చూసుకుని, వారి జీవన ప్రయాణంలో మనల్ని కూడా యాత్రికులను చేసే విధంగా 'నిరంతర యాత్రికుడు' నవలికను రచించారు కె.వి.వి.ఎస్.మూర్తి.



ఇందులో సివిల్ సర్వీస్‌లో చేరాలనే కోరికతో కష్టపడి చదువుకున్న యువకుడి జీవన ప్రయాణం ఇది. ఒక సందర్భంలో రచయిత "నాకు సివిల్ సర్వీస్లో ర్యాంకు వస్తుందో లేదో తెలియదు గానీ చదవడంలో ఉన్న మాధుర్యాన్ని, జ్ఞానంలో ఉన్న తేజాన్ని నాకు పరిచయంచేసింది కాలం. అది నా జీవితాన్ని మొత్తం ప్రభావితంచేసింది" అని పేర్కొన్నారు. ఇదే కదా నేడు మనం చూడలేకపోతున్నది. ఫలితం ఇచ్చే లాభం చూస్తున్నాం కానీ ప్రయత్నం ఇచ్చే అమూల్యమైన అనుభవం చూడట్లేదు.

అలాంటి అనుభవంతోనే అనుకోకుండా ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభిస్తాడు. దమ్ముగూడెం అనే చిన్న ఊరు, అక్కడి పరిసరాలు, ప్రజలు, పిల్లలు వారి మనస్తత్వాలు అన్నిటినీ అక్షర రూపంలో భద్రపరిచారు. ఒక కొత్త ప్రాంతానికి వెళ్ళినప్పుడు అక్కడి వాళ్ళను ఎలా పరిచయం చేసుకుని, అక్కడి పరిస్థితులను గమనించి ఎలా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారో రచయిత చాలా చక్కగా వివరించారు. ఇది ఎంతో అవసరమైన జీవన నైపుణ్యం. నేటి తరంలో కొరవడుతున్న కళ. ఆరెంకల జీతం సునాయాసంగా సంపాదించగలుగుతున్నాం గానీ ఆరుగురు మనుష్యులను మన వాళ్ళని చెప్పుకోలేని దుస్థితిలో ఉన్నాం. ఈ నవల చదివినప్పుడు మానవ సంబంధాలెంత ముఖ్యమో తెలుస్తుంది.

ప్రపంచాన్ని చూస్తేనే మనుష్యులని చదవగలం. మనకేంటి ఉపయోగం అంటారా? మన జీవిత దృక్పథం మార్చేది యాత్రలే! ఈ నవలికలో మూర్తిగారు పర్యటించిన ప్రతీ ప్రదేశానికి మనల్ని కూడా తీసుకెళతారు. అక్కడి భౌగోళిక పరిస్థితులని, సామాజిక స్థితులని, సామాన్య ప్రజల జీవనాన్ని చూపించారు. ఒక జీవితంలో సంపూర్ణత్వాన్ని పొందడానికి ఖండాంతరాలు తిరగాల్సిన పని లేదు.. మన భారతదేశాన్ని చూస్తే చాలు. ఆయన అనుభవాల్లో పొందిన మానసిక సంఘర్షణను, ఆధ్యాత్మిక చింతనను చూస్తే ఆశ్చర్యం కలుగక మానదు. మన జీవితంలో సంపాదించుకున్న జ్ఞానం, అనుభవాలు, అనుబంధాలే కదా నిజమైన ఆస్తి. ఈ నవలికలో నిక్షిప్తమైన తన నిధిని మనతో పంచుకున్న ఆయనకు అభినందనలు.

డా. హారిక చెరుకుపల్లి, 9000559913

ఐఏఎస్ నుంచి పూజా ఖేడ్కర్ తొలగింపు

న్యూఢిల్లీ: ఐఏఎస్ ప్రొబేషనరీ మాజీ అధికారిణి పూజా ఖేడ్కర్‌కు కేంద్రం షాక్ ఇచ్చింది. ఆమెను ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ నుంచి తొలగించింది. ఐఏఎస్ (ప్రొబేషన్) రూల్స్, 1954 ప్రకారం ఆమెపై చర్యలు తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. తమ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని వివరించాయి. మహారాష్ట్రలోని పుణెలో ట్రైనీ సహాయ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆమెపై పలు ఆరోపణలు వచ్చాయి. అధికార దుర్వినియోగంతో పాటు యూపీఎస్సీలో తప్పుడు అఫిడవిట్ పత్రాలు సమర్పించి లబ్ధి పొందారని పలువురు యూపీఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు. దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ ఆమెను ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీకి తిరిగి రావాలని ఆదేశించింది. ఫేక్ డాక్యుమెంట్లతో పరీక్ష రాసి క్లియర్ చేసినట్లు గుర్తించిన యూపీఎస్సీ వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులిచ్చింది. ఆమెపై ఫోర్జరీ కేసు నమోదు చేసింది. ఆ తరువాత అభ్యర్థిత్వాన్ని రద్దు చేసింది. దీనిపై ఆమె హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా యూపీఎస్సీ చేసిన వాదనలను పూజ ఖండించారు. తాను ఫేక్ సర్టిఫికెట్లు పెట్టలేదని చెప్పారు. యూపీఎస్సీకి తనపై అనర్హత వేటువేసే అధికారం లేదని వాదించారు. అయితే ఆమె ఆరోపణలను ఖండించిన కేంద్రం ఐఏఎస్ నుంచి తొలగించింది.

తోడేళ్ల దాడులే కీలకాంశం!

యూపీలో యోగి సర్కారు ఘోర వైఫల్యాన్ని ఎండగడతాం

కాంగ్రెస్, ఎస్పీ హెచ్చరిక

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో తోడేళ్ల దాడులపై రాజకీయ దుమారం రేగింది. ప్రజల ప్రాణాలను కాపాడటంలో బీజేపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఇండియా ఐక్యసంఘటన భాగస్వామ్య పక్షాలు కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు విమర్శలు ఎక్కుపెట్టాయి. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా ఉన్నవారు పోటీ చేసి విజయం సాధించడం, ఒక ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడిన క్రమంలో మొత్తం పది అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ఇంకా ప్రకటించలేదు. కర్హాల్, మిల్కిపూర్, కతేహరి, కుందర్కి ఘజియాబాద్, ఖైర్, మీరాపూర్, ఫుల్పూర్, మఝువాన్, సిసామావు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇండియా ఐక్యసంఘటన యోగి సర్కారును లక్ష్యంగా చేసుకుంది. అప్రజాస్వామిక పని తీరు, శాంతిభద్రతలు పతనం, ఇటీవలి కాలంలో మనుషులపై తోడేళ్ల దాడుల అంశాలపై విమర్శలతో విరుచుకుపడుతోంది. ఉత్తరప్రదేశ్‌లో లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని ఘన విజయం సాధించిన ఎస్పీ, కాంగ్రెస్ పార్టీలు రాబోయే 10 అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ కలిసి పోటీ చేస్తామని ప్రకటించాయి. ఎస్పీ ముఖ్య అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి పీటీఐతో మాట్లాడుతూ... "తోడేళ్ల దాడులను ఆపడంలో ప్రభుత్వం విఫలమైంది. ఇది మొత్తం రాష్ట్ర ప్రజలను అభద్రతలోకి నెట్టింది. మేము ఈ సమస్య తీవ్రంగా పరిగణిస్తున్నాం. రాష్ట్రం ప్రభుత్వ పని తీరు ప్రజాస్వామ్యబద్ధంగా లేదు. ఎలాంటి అభివృద్ధి చేయలేదు" అని విమర్శించారు. ఉప ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామనే విషయంపై కాంగ్రెస్‌తో అవగాహన కుదిరిందన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు (అఖిలేశ్ యాదవ్) ఈ విషయంలో (సీట్ల వాటా) ఉదారంగా వ్యవహరిస్తారని, వారు (కాంగ్రెస్) ఎక్కడ గెలవగలరని భావిస్తారో, ఆ సీట్లు వారికే ఇస్తారని స్పష్టం చేశారు. సీట్ల పంపిణీ ఇంకా ఖరారు కాలేదని... ప ఎన్నికలకు ఇంకా సమయం ఉందని ఆయన అన్నారు. ఎన్నికలు జరగాల్సిన 10 సీట్లలో సమాజ్‌వాదీ పార్టీ 2022 ఎన్నికల్లో కర్హాల్, మిల్కిపూర్, కతేహరి, కుందర్కి, సిసామావులను గెలుచుకోగా, మీరాపూర్‌ను ఎస్పీతో పొత్తు పెట్టుకుని పోటీ చేసిన ఆర్ఎల్‌డీ కైవసం చేసుకుంది. ఇప్పుడు ఆ పార్టీ ఎన్డీఏలో ఉంది. కాగా ఘజియాబాద్, ఖైర్, ఫుల్పూర్ స్థానాలను బీజేపీ గెలుచుకోగా... మఝ్వాన్ దాని మిత్రపక్షమైన నిషాద్ పార్టీకి వెళ్లింది. 403 మంది సభ్యుల సభలో బీజేపీకి 251 మంది ఎమ్మెల్యేలు ఉండగా, ప్రతిపక్ష సమాజ్ వాదీ పార్టీకి 105 మంది ఉన్నారు. బీజేపీ మిత్రపక్షాలు అప్నా దళ్ (సోనేలాల్), నిషాద్ పార్టీకి వరుసగా 13, ఐదుగురు చొప్పున ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక ఎన్డీఏ భాగస్వామ్యులుగా ఉన్న ఆర్ఎల్‌డీ, భారతీయ సమాజ్ పార్టీకి వరుసగా ఎనిమిది, ఆరుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇక కాంగ్రెస్, జనసత్తా దళ్ (లోక్‌తాంత్రిక్)లకు ఇద్దరేసి ఎమ్మెల్యేలు ఉండగా, బహుజన్ సమాజ్ పార్టీకి ఒక సభ్యుడు ఉన్నారు. కాంగ్రెస్ యూపీ అధ్యక్షుడు అజయ్ రాయ్ మాట్లాడుతూ... తోడేళ్ల దాడులను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ భయం నగరాలకు పాకుతోందని చెప్పారు. శాంతిభద్రతలు, నకిలీ ఎన్‌కౌంటర్లు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం రాష్ట్రాన్ని పీడిస్తున్నాయని తెలిపారు.

ఇప్పటివరకు 8మంది మృతి

ఉత్తర్ ప్రదేశ్ ప్రజలను తోడేళ్లు, నక్కల దాడులు కలవరపెడుతున్నాయి. నరమాంసం రుచి మరిగిన తోడేళ్లు బహ్రైచ్ జిల్లాలో వరుసగా గ్రామాలపై దాడులకు తెగబడుతున్నాయి. గత జులై నుంచి ఇప్పటి వరకు 8 మందిని చంపేశాయి. ఇందులో ఏడుగురు పిల్లలే ఉన్నారు. 30 మందిని గాయపర్చినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

జిల్లాలోని మహసీ తహసీల్ ప్రాంతంలో మార్చి నుంచి తోడేళ్ల దాడుల ఘటనలు జరిగాయి. జులై నుండి వర్షాకాలంలో దాడుల తీవ్రత పెరిగింది. పొరుగున ఉన్న సీతాపూర్ జిల్లాలో కూడా జంతువుల దాడిగా అనుమానించబడుతున్న ఘటనలు జరిగాయి. సెప్టెంబర్ 2న ఓ గ్రామంలో ముగ్గురు మహిళలు గుర్తు తెలియని జంతువుల దాడిలో గాయపడ్డారు. మహిళలపై తోడేళ్లు దాడి చేశాయని స్థానికులు పేర్కొంటుండగా, జంతువుల నమూనాలు, పాదముద్రలను సేకరించిన అటవీ శాఖ అధికారులు ఇది నక్కల పనేనని అనుమానిస్తున్నారు. ప్రస్తుతం తోడేళ్లను పట్టుకునేందుకు ఏకంగా ప్రభుత్వం 200 మంది అటవీ, పోలీస్ అధికారుల్ని రంగంలోకి దించింది. ఇప్పటికే నాలుగు తోడేళ్లను బంధించినప్పటికీ, దాడులు ఆగడం లేదు. దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. చివరకు యూపీ సర్కార్ కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులు జారీ చేసింది.

నక్కల దాడిలో 12మందికి గాయాలు

ఇప్పటికే తోడేళ్ల దాడుల వార్తలు సంచలనంగా మారిన వేళ, నక్కలు కూడా దాడులకు తెగబడుతున్నాయి. తాజాగా పిలిభిత్ జిల్లాలో రెండు గ్రామాల్లో నక్కలు దాడులు చేశాయి. ఐదుగురు చిన్నారులతో సహా కనీసం 12 మంది గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం జహనాబాద్ ప్రాంతంలోని సుస్వార్, పస్సోలి గ్రామాల్లో ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారులుపై నక్కలు మొదటి దాడి చేశాయి.

చిన్నారులను రక్షించేందుకు కొందరు వృద్ధులు వెళ్లగా వారిపై కూడా దాడి చేశాయి. దాడి తర్వాత గాయపడిన మొత్తం 12 మందిని జహనాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చేర్చారు. అక్కడ వారికి అత్యవసర చికిత్స కొనసాగుతోంది. నక్కల దాడితో కోపోద్రిక్తులైన స్థానికులు దాడి చేసిన నక్కల్లో ఒక దానిని చంపేశారు.

తృణమూల్‌కు భారీ షాక్

ఎంపీ పదవికి 'జవహర్' రాజీనామా... మమతకు లేఖ

కోల్‌కతా: ఆర్జీ కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటనతో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ జవహర్ సిర్కార్ పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రాసిన లేఖలో పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. ఆర్జీ కర్ ఘటనకు నిరసనగా తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. 'పార్టీలో అస్మదీయులు, అవినీతిపరులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. అవినీతిపై ప్రభుత్వానికి ఆందోళన లేకపోవడం, ఒక వర్గం నాయకులు మిగిలిన వారిని అణగదొక్కడం వంటి చర్యలతో నాకున్న భ్రమలు తొలగిపోయాయి. అవినీతి అధికారులు అందలం ఎక్కడం వంటి విషయాలను నేను ఏ మాత్రం అంగీకరించలేను. నేను పార్టీలో ఉన్న ఇన్నేళ్లలో ఈ స్థాయి ఆందోళన, ప్రభుత్వ విశ్వాస రాహిత్యాన్ని ఎన్నడూ చూడలేదు. ఆర్జీ కర్ ఆస్పత్రిలో భయంకర ఘటన జరిగిన తర్వాత ఓపిగ్గా నెలరోజులపాటు ఎదురు చూశాను. మీరు (మమతా బెనర్జీ) పాత శైలిలో నేరుగా రంగంలోకి దిగి జూనియర్ డాక్టర్ల సమస్యపై స్పందిస్తారని ఆశించాను. కానీ, అది జరగలేదు. ప్రభుత్వం ఇప్పుడు చాలా ఆలస్యంగా అరకొర చర్యలు తీసుకొంది. పార్లమెంట్‌లో బెంగాల్ సమస్యలు ప్రస్తావించేందుకు మీరు నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. నేను ఇక ఎంపీగా కొనసాగలేను. అవినీతి, మతతత్వం, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల్లో నియంతృత్వంపై పోరాడటంలో ఏమాత్రం రాజీలేదు' అని జవహర్ తన లేఖలో పేర్కొన్నారు. ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అవినీతి విషయంలో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇప్పటికే అతడిని ఈడీ, సీబీఐ విచారిస్తున్నాయి. అతడి ఆస్తులపై దాడులు నిర్వహించాయి. వీటికి సంబంధించి అతడికి సుప్రీం కోర్టులో కూడా ఊరట లభించలేదు. రెసిడెంట్ డాక్టర్ హత్యాచారం ఘటన జరిగిన ప్రదేశంలో సాక్ష్యాల చెరిపివేతకు ఆదేశాలు జారీ చేసింది కూడా అతడేనని తేలింది. అతడికి మరో కళాశాలలో పోస్టింగ్ ఇవ్వడంతో మమత సర్కారుపై తీవ్ర స్థాయిలో విమర్శలొచ్చాయి.

యూట్యూబ్‌లో చూస్తూ ఆపరేషన్...

బాలుడి మృతి

పట్నా: దేశంలో నకిలీ వైద్యుల కారణంగా ఇటీవల చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా సరైన విద్యార్హతలు లేని ఓ నకిలీ వైద్యుడు యూట్యూబ్ చూస్తూ బాలుడికి శస్త్రచికిత్స చేయడంతో అతడు చనిపోయారు. ఈ ఘటన బీహార్‌లో చోటు చేసుకొంది. పోలీసుల వివరాల ప్రకారం... సరన్‌లో నివాసముంటున్న ఓ బాలుడు అనారోగ్యంతో వాంతులు చేసుకున్నాడు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు అతడిని సమీపంలోని గణపతి ఆస్పత్రికి తరలించారు. కొంతసేపటికి వాంతులు తగ్గిపోయాయి. ఈ క్రమంలోనే నకిలీ వైద్యుడు బాలుడి పిత్తాశయంలో రాళ్లు ఉన్నాయని... వాటిని తొలగించేందుకు ఆపరేషన్ తప్పనిసరంటూ చెప్పాడు. కుటుంబసభ్యులను బలవంతంగా ఒప్పించాడు. యూట్యూబ్‌లో వీడియోలు చూస్తూ బాలుడికి ఆపరేషన్ చేశాడు. కొంతసేపటికి అతడి పరిస్థితి విషమించింది. కంగారు పడిన ఆ నకిలీ వైద్యుడు మెరుగైన చికిత్స కోసం బాలుడిని పెద్దాస్పత్రికి అంబులెన్స్‌లో తరలించాడు. బాలుడు మార్గ మధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని అక్కడే వదిలేసి నకిలీ డాక్టర్ సహా సిబ్బంది పరారయ్యారు.

తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. 'మా మనవడికి చాలాసార్లు వాంతులు కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లాం. కాస్త కుదుటపడిన తర్వాత ఇంటికి తీసుకెళుతుండగా... ఆ వైద్యుడు ఆపరేషన్ చేయాల్సిందేనని పట్టుబట్టాడు. యూట్యూబ్ చూస్తూ సర్జరీ చేయడాన్ని మేం గమనించాం. అతడి విద్యార్హతలు తెలుసుకోకుండా మా అబ్బాయిని ఆస్పత్రిలో చేర్పించాం' అంటూ బాలుడి తాతయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

చిన్నారుల ఆచూకీ కోసం 500 కెమెరాలు, 7 పోలీసు బృందాలు

న్యూఢిల్లీ: పాఠశాల నుంచి ఇంటికి తిరిగిరాని ఇద్దరు విద్యార్థులను గుర్తించేందుకు పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. వారి ఆచూకీ కోసం ఏడు పోలీసు బృందాలు రంగంలోకి దిగి... 500 సీసీ కెమెరాలను జల్లెడ పట్టాయి. ఎట్టకేలకు వారి ఆచూకీ లభించింది. ఈ ఘటన దిల్లీలో చోటు చేసుకొంది. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. నోయిడాలోని ఓ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు... ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో తప్పారు. ప్రోగ్రెస్ కార్డును తల్లిదండ్రులకు చూపించి, మరుసటి రోజు వారిని కూడా పాఠశాలకు వెంట తీసుకురావాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు చెప్పారు. తల్లిదండ్రులు మందలిస్తారని భయపడి... ఇంటికి వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. సమయం గడుస్తున్నా బిడ్డలు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. పలు చోట్ల వెతికి చివరికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఆచూకీ గుర్తించేందుకు ఏడు పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. పాఠశాల నుంచి ఎక్కడికి వెళ్లారో తెలుసుకునేందుకు ఆ మార్గంలోని 500 సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. ఎట్టకేలకు వారి ఆచూకీ తెలిసింది. స్కూల్ నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ ప్రాంతంలో వారిని గుర్తించారు. విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగించారు. ఇలాంటి తప్పిదాలు జరగకుండా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. పోలీసుల కృషిపై నెటిజన్లు ప్రశంసలు కురిపించారు.

కోవిడ్ నిధులూ తినేశారు

కర్నాటకలో వెలుగులోకి మరో కుంభకోణం

మైఖేల్ కమిషన్ మధ్యంతర నివేదిక

బీజేపీ నేతలపై చర్యలకు సిద్ధమవుతున్న ప్రభుత్వం

బెంగళూరు: కర్నాటకలో మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. గత బీజేపీ హయాంలో కోవిడ్ నిర్వహణకు కేటాయించిన రూ.1,120 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖేల్ కమిషన్ మధ్యంతర నివేదిక సమర్పించింది. దీంతో ఈ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించిన కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు అనుగుణంగా చర్యలకు సన్నద్ధమౌతోంది. అయితే, ముడా కుంభకోణానికి ప్రతిగానే రాష్ట్ర ప్రభుత్వం దీనిని తెరపైకి తెచ్చిందని బీజేపీ ఆరోపిస్తున్నది. మైఖేల్ కమిషన్ సమర్పించిన నివేదికను అధ్యయనం చేసి, తదుపరి చర్యలను సూచించాల్సిందిగా కోరుతూ కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. నెల రోజుల్లో నివేదిక సమర్పించాలని గడువు ఇచ్చింది. ఈ అంశానికి సంబంధించి విచారణను పూర్తి చేసేందుకు మైఖేల్ కమిషన్ గడువు మరో ఆరు నెలలు పొడిగించింది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉండగా మొదటిసారి లాక్‌డౌన్ విధించిన 2020 మార్చి నుంచి 2022 డిసెంబరు 31 వరకు కోవిడ్ నిర్వహణకు ఖర్చు చేసిన రూ.7,223 కోట్ల నిధుల్లో రూ.1,120 కోట్ల దుర్వినియోగం జరిగిందని సిద్ధరామయ్య నియమించిన జాన్ మైఖేల్ కమిషన్ తెలిపింది.

ఇదిలావుండగా, అధికార కాంగ్రెస్ పార్టీ నేతల తీరు వల్ల తన భద్రతకు ముప్పు ఏర్పడిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, కేంద్ర హోం శాఖకు రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణకు తాను ఇచ్చిన అనుమతిని రాజకీయ పక్షపాతంతో కూడినదిగా చూస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కొందరు రాష్ట్ర మంత్రులు, నేతలు ఉద్దేశపూర్వకంగా "గో బ్యాక్ గవర్నర్" ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు.

తండ్రికి వెన్నుపోటు పొడవడం తగదు

అజిత్ పవార్

ముంబై: రాజకీయ లబ్ధి కోసం తండ్రికి వెన్నుపోటు పొడవడం తగదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఎన్‌సీపీ అధినేత అజిత్ పవార్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. దీనిలో భాగంగా అజిత్ పవార్ జన సమ్మాన్ యాత్ర నిర్వహిస్తున్నారు. ఆ యాత్రలో... రాష్ట్ర మంత్రి ధర్మారావు బాబా ఆత్రం, ఆయన కుమార్తె భాగ్యశ్రీ గురించి మాట్లాడారు. భాగ్యశ్రీ తండ్రి ... ప్రత్యర్థి పార్టీ శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ (ఎస్‌పీ)లోకి వెళ్తున్నారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. అంతేకాదు తండ్రి ధర్మారావు బాబా ఆత్రంపై కుమార్తె భాగ్యశ్రీ పోటీ చేస్తుందన్న ప్రచారం మొదలైంది. ఆ ప్రచారంపై అజిత్ పవార్ స్పందించారు. 'తండ్రిపై కుమార్తె పోటీ చేయడం ఎంత వరకు కరెక్ట్. కూతురిని... తండ్రి కంటే ఎక్కువగా ఎవరూ ప్రేమించరు. పెళ్లి చేసుకుని భాగ్యశ్రీ బెల్గాం వెళ్లినప్పటికీ... గడ్చిరోలిలో ఆమెకు (తండ్రి ఆత్రం) అండగా నిలిచి జిల్లా పరిషత్ అధ్యక్షురాలిని చేశారు. ఇప్పుడు మీరు (భాగ్యశ్రీ) మీ తండ్రికి వెన్నుపోటు పొడిచి ఆయన మీదే పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. మీ నిర్ణయం సరైందేనా అని ప్రశ్నించారు. 'ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మీరు మీ తండ్రికి మద్దతు ఇవ్వండి. అతడిని గెలిపించండి. ఎందుకంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే సామర్థ్యం , సంకల్పం ఆయనకు మాత్రమే ఉంది. కుటుంబంలో చీలికలు రావడాన్ని సమాజం అంగీకరించదు. నా విషయంలోనూ ఇదే జరిగింది. లోక్ సభ ఎన్నికల్లో బారామతి స్థానం నుంచి తన సోదరి సుప్రియ సూలేపై తన భార్య సునేత్ర పవార్‌ను పోటీకి దింపి ఉండాల్సింది కాదు. నేను తప్పు చేశా. చేసిన తప్పును ఇప్పుడు ఒప్పుకుంటున్నా' అని అన్నారు.

తమిళ నటుడు విజయ్ పార్టీకి అధికారిక గుర్తింపు

చెన్నై: ప్రముఖ తమిళ నటుడు విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' పార్టీ భారత ఎన్నికల కమిషన్ వద్ద అధికారికంగా రిజిస్టర్ అయింది. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. రాజకీయ పార్టీగా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వచ్చిందని అందులో పేర్కొన్నారు.

రేప్ చేసి... బ్లాక్‌మెయిల్

ఎస్పీ నేతపై యువతి ఫిర్యాదు

లక్నో: మహిళలపై జరుగుతున్న దారుణాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నా... ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేస్తున్నా వారిపై దురాగతాలు మాత్రం ఆగడంలేదు. యూపీలోని మవూ జిల్లాలో 18 ఏళ్ల యువతిపై దాదాపు ఏడాది కాలంగా జరుగుతోన్న దారుణం తాజాగా వెలుగులోకి వచ్చింది. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన స్థానిక నేత తనపై ఏడాది కాలంగా అత్యాచారానికి ఒడిగడుతున్నట్లు బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మవూలోని కొత్వాలినగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దారుణం చోటుచేసుకుంది. నిందితుడిని సమాజ్‌వాదీ పార్టీ స్థానిక నేత, న్యాయవాది అయిన వీరేంద్ర పాల్‌గా గుర్తించారు. బాధిత యువతి అతడికి న్యాయపరమైన అంశాల్లో సహకరిస్తుండేదని పోలీసులు తెలిపారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. "యువతికి మత్తుమందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చిన పాల్.. తన కారులో నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ దుశ్చర్యను వీడియోతీసి ఆమెను బ్లాక్‌మెయిల్ చేస్తూ ఏడాది కాలంగా ఈ దుర్మార్గాన్ని కొనసాగిస్తున్నాడు. ఆమె జీవితాన్ని నాశనం చేయడమే కాకుండా రూ.4లక్షలు దోచుకున్నాడని యువతి ఆరోపించింది. చివరిసారిగా అతడిని జులై 16, 17 తేదీల్లో ఓ హోటల్‌లో కలుసుకున్నానని.. అక్కడ కూడా తనపై అఘాయిత్యానికి పాల్పడ్డాడని బాధితురాలు వాపోయింది. సెప్టెంబర్ 6న తన వాహనాన్ని తిరిగి తీసుకురావడానికి వెళ్లగా తనను కొట్టి దుర్భాషలాడాడని, చంపేస్తానంటూ బెదిరింపులకు దిగాడని మహిళ ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన పోలీసులు అతడిపై భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నామన్నారు.

14న జమ్మూలో మోదీ ఎన్నికల ప్రచారం

జమ్మూ: ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 14న జమ్మూలో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకశ్మీర్లో తొలిసారిగా ఎన్నికలు జరగనున్నాయి. మోదీ పెద్దఎత్తున సభల్లో పాల్గొననున్నారు. ఈ ప్రాంతానికి సంబంధించిన వివిధ కీలక అంశాలను ప్రధాని ప్రస్తావించే అవకాశం ఉంది. రాష్ట్ర హోదా కోల్పోయి కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగడం ఇదే తొలిసారి. 2014లో ఐదు దశల్లో జరిగాయి. ఈసారి మూడు విడతల్లోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. మొత్తం 90 అసెంబ్లీ స్థానాలకు తొలిదశలో 24 స్థానాలకు, రెండు, మూడు దశల్లో వరుసగా 26, 40 స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఈ నెల 18న తొలి విడత, 25న రెండో విడత, అక్టోబరు ఒకటిన మూడో విడత పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబరు నాల్గోతేదీ ఫలితాలు వెల్లడి కానున్నాయి.

విరిగిన ట్రైన్ కప్లింగ్ ...

రెండుగా విడిపోయిన మగధ్ ఎక్స్‌ప్రెస్

పాట్నా: ట్రైన్ కంపార్ట్‌మెంట్స్ మధ్య కప్లింగ్ తెగిపోయింది. దీంతో ఆ రైలు రెండుగా విడిపోయింది. ప్రయాణికులు భయాందోళన చెందారు. బీహార్‌లోని బక్సర్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలివి. న్యూఢిల్లీ నుంచి ఇస్లాంపూర్ వెళ్తున్న మగధ్ ఎక్స్‌ప్రెస్ బోగీల నడుమ కప్లింగ్ తెగిపోయింది. దీంతో ట్వినిగంజ్, రఘునాథ్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య ఆ రైలు రెండుగా విడిపోయింది. ఆదివారం ఉదయం 11.08 గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అయితే ఎవరికీ ప్రమాదం జరుగలేదని చెప్పారు. 'రైలు ట్వినిగంజ్ స్టేషన్ దాటినప్పుడు ఈ సంఘటన జరిగింది. రైలు ఇంజన్ నుంచి 13, 14వ కంపార్ట్‌మెంట్స్... ఎస్-7, ఎస్-6 కోచ్‌ల మధ్య కప్లింగ్ ఊడిపోయింది... రైలు రెండుగా విడిపోయింది' అని ఈస్ట్ సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (సీపీఆర్‌వో) సరస్వతి చంద్ర వెల్లడించారు. కాగా, రెస్క్యూ టీమ్, సాంకేతిక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయని రైల్వే అధికారులు తెలిపారు. సమస్యను సరిచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. రైలు కప్లింగ్ విరిగిపోవడంపై దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. దీనివల్ల డౌన్‌లైన్‌లో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు వివరించారు.

ప్రముఖ టీవీ నటుడు వికాస్ సేథి మృతి

ముంబై : బుల్లితెర ప్రముఖ నటుడు వికాస్ సేథి (48) ఆదివారం కన్నుమూశారు. ఆయనకు భార్య జాన్వి సేథి, కవల కుమారులు ఉన్నారు. వికాస్ మరణవార్తతో టీవీ పరిశ్రమలో విషాదం నెలకొంది. నిద్రలో తీవ్ర గుండెపోటు రావడంతో ఆయన ప్రాణాలు కోల్పోయినట్టు టెలిచక్కర్‌లోని ఒక నివేదిక తెలిపింది. అయితే, నాగపూర్‌లో ఒక విందు కార్యక్రమానికి వెళ్లామనీ, అక్కడి నుంచి మా అమ్మ గారి ఇంటికి వచ్చిన తరువాత వాంతులు చేసుకున్నారు, ఆసుపత్రికి వెళదామంటే ఒప్పుకోలేదు, ఆ తరువాత కొద్ది సేపటికే మృతిచెందాడని వికాస్ భార్య తెలిపారు. 1976 మే 12న చండీగఢ్‌లో జన్మించిన వికాస్ జాన్వీ సేథీని పెళ్లి చేసుకున్నారు. పెళ్లయ్యాక ఇద్దరు మగ కవల పిల్లలకు తండ్రయ్యారు. టీవీ సీరియళ్లతో పాటు, వికాస్ బాలీవుడ్, తెలుగు సినిమాల్లో కూడా పనిచేశారు. 2001 బ్లాక్ బస్టర్ బాలీవుడ్ చిత్రం 'కభీ ఖుషీ కభీ గమ్'లో కనిపించారు. ఇందులో కరీనా కపూర్ ప్రియుడు రాబీ పాత్రలో నటించారు.

మావోయిస్టుల అణచివేతకు 4వేలమంది జవాన్లు

న్యూఢిల్లీ: మావోయిస్టుల అంతమే లక్ష్యంగా నిర్ణయాత్మక పోరు ప్రారంభించే వ్యూహంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చత్తీస్‌గఢ్ బస్తర్ జిల్లా నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లోకి నాలుగు బెటాలియన్లతో 4వేల మందికి పైగా సీఆర్‌పీఎఫ్ జవాన్లను తరలిస్తోంది. 2026 మార్చిలోగా మావోయిస్టు సమస్యను అంతం చేయాల కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. గత నెలలో చత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ గడువును ప్రకటిస్తూ... దేశానికి మావోయిస్టుల బెడద నుంచి విముక్తి కల్పించడానికి బలమైన, కఠినాత్మక కార్యాచరణ ప్రణాళిక అవసరమని స్పష్టం చేశారు. బస్తర్ ప్రాంతంలో మోహరింపు కోసం జార్ఖండ్ నుంచి మూడు, బీహార్ నుంచి ఒక బెటాలియన్‌ను సీఆర్‌పీఎఫ్ ఉపసంహరించుకున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ఈ రెండు రాష్ట్రాల్లో పరిస్థితులు మెరుగైనందున ఈ బెటాలియన్‌లను ఇప్పుడు చత్తీస్‌గఢ్‌లో బాగా ఉపయోగించుకోవచ్చని వారు చెప్పారు. సీఆర్‌పీఎఫ్‌కు చెందిన 159, 218, 214, 22 బెటాలియన్లు చత్తీస్‌గఢ్‌లో ప్రస్తుతం ఉన్న బలగాలకు సిబ్బందిని జోడించడానికి మోహరించబడుతున్నాయని వెల్లడించాయి.

ఒక్కో బెటాలియన్‌లో దాదాపు 1,000 మంది జవాన్లు ఉంటారు. ఈ యూనిట్లను సుదూర జిల్లాలైన దంతెవాడ, సుక్మా, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలతో కూడిన ట్రై జంక్షన్ సరిహద్దుల్లోని మారుమూల ప్రాంతాల్లో మోహరిస్తున్నట్లు వారు వివరించారు. మారుమూల ప్రాంతాల్లో మరిన్ని ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్‌లను (ఎఫ్ఓబి) ఏర్పాటు చేసేందుకు ఈ బెటాలియన్లు సిఆర్‌పిఎఫ్ కోబ్రా యూనిట్లతో చేతులు కలుపుతాయని దిల్లీలోని సీఆర్‌పీఎఫ్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

దీపికా రణ్ వీర్ దంపతులకు ఆడపిల్ల

ముంబై: బాలీవుడ్ దంపతులు దీపిక పదుకొనే, రణవీర్ సింగ్ ఇంట కొత్త కాంతులు ఉదయించాయి. తమకు అమ్మాయి పుట్టిందని ఆ దంపతులు ఒక ప్రకటనలో వెల్లడించారు. "వెల్కమ్ బేబీ గాళ్- 8-09-2024-దీపిక అండ్ రణవీర్" అంటూ ఇన్ స్టాగ్రామ్‌లో చిన్న ప్రకటన వెలువరించారు.

దీపిక పదుకొనే ఈ నెల 7వ తేదీన ముంబైలోని హెచ్ఎన్ రిలయన్స్ ఆస్పత్రికి వెళ్లడంతోనే, ఆమె ప్రసవంపై ఊహాగానాలు బయల్దేరాయి. దీపిక పదుకొనే, రణవీర్ సింగ్ దంపతులకు ఇదే మొదటి సంతానం కావడంతో అందరి దృష్టి ఇటువైపే ఉంది. చాలాకాలం పాటు ప్రేమలో కొనసాగిన వారు 2018 నవంబరులో పెళ్లితో ఒక్కటయ్యారు. ఆరేళ్ల తర్వాత తొలి సంతానానికి స్వాగతం పలికారు.

భారీ ప్రాణనష్టం

వర్షాలు, వరదలకు 45 మంది మృతి

అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లాలోనే...

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: భారీ వర్షాలు, వరదల కారణంగా భారీగా ప్రాణనష్టం వాటిల్లింది. 45 మంది మృతి చెందినట్లు ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. వరదల్లో గల్లంతైన మరొకరి ఆచూకీ లభించలేదు. వరద నీరు తగ్గుముఖం పట్టడంతో ఒక్కొక్క మృతదేహం బయట పడుతోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని తెలిసింది. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే 35 మంది ఉండగా, వారిలో ఇద్దరు ఆచూకీ లభించలేదు. విజయవాడ నగరం, రూరల్ పరిధిలో ఏకంగా 25 మంది వరదలు ముంచెత్తి మృత్యువాత పడ్డారు. విజయవాడ మొగల్రాజపురంలో కొండచరియలు విరిగి ఐదుగురు మృతి చెందారు. రూరల్‌లో మండలంలో ఎనిమిది మంది, జి.కొండూరు నలుగురు, రెడ్డిగూడెం ఒకరు, కంచికచర్ల ఒకరు, మైలవరం ఇద్దరు, ఇబ్రహీంపట్నం ఇద్దరు, విజయవాడ నార్త్ మండలంలో పది మంది, సెంట్రల్ ఒకరు, విజయవాడ వెస్ట్‌లో ఒకరు మృతి చెందారు. గుంటూరు జిల్లాల్లో ఐదుగురు మృతి చెందగా, అందులో ఉపాధ్యాయుడు, ఇద్దరు విద్యార్థులున్నారు. పల్నాడు జిల్లాలో ఒకరు మరణించారు. ఏలూరుజిల్లా ఇద్దరు చనిపోయారు. నూజివీడులో ఒకరు, అగిరిపల్లిలో ఒకరు మరణించినట్లు నమోదైంది. భారీ వర్షాలు, వరదలతో ఎన్టీఆర్, గుంటూరు, కృష్ణా, ఏలూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో మొత్తం 6,44,133 మందిపై ప్రభావం చూపింది. వారి కోసం ప్రభుత్వం 246 పునరావాస శిబిరాలను ఏర్పాటు చేయగా, ఇప్పటివరకు వాటికి 48,528 మందిని తరలించారు. ఎన్టీఆర్‌జిల్లాలోనే 2.76 లక్షల మంది ప్రజలు అతలాకుతలమయ్యారు. ఆ తర్వాత గుంటూరుజిల్లాలో 65,311 మంది, కృష్ణాలో 2.37లక్షల మంది, ఏలూరులో 9642 మంది, పల్నాడులో 25,324 మంది, బాపట్ల 30వేల మంది, ప్రకాశం 856 మందిపై ప్రభావం చూపింది. ఇప్పటికే మృతుల కుటుంబాలకు రూ.ఐదు లక్షల నష్టపరిహారం ప్రభుత్వం ప్రకటించింది.

జంతువులు, కోళ్లు మృత్యువాత

భారీ వర్షాలు, వరదలతో జంతువులకూ అపార నష్టం వాటిల్లింది. మొత్తంగా 473 జంతువులు మరణించగా, ఇందులో 116 పెద్దవి, 357 చిన్నవి ఉన్నాయి. 71,639 కోళ్లు చనిపోయాయి. మత్స్యకారులకూ తీవ్ర నష్టం వాటిల్లింది. 226 బోట్లు పాక్షికంగా, మరో 377 పూర్తి స్థాయిలో దెబ్బతిన్నాయి. వలలు 1,939 పూర్తిగాను, పాక్షికంగా 70 పాడయ్యాయి. విద్యుత్ రంగంపైనా వరదల నష్టం ప్రభావం చూపింది. వ్యవసాయ రంగాన్ని భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేశాయి. 1,81,538 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లింది. 20 జిల్లాల్లో 2,05,194 మంది రైతులు నష్టానికి గురయ్యారు. మరో 12 జిల్లాల్లోని ఉద్యానవన పంటలు 19,686 హెక్టార్లలో దెబ్బతినగా, 30,877 మంది రైతులకు అపార నష్టం వాటిల్లింది. తాగునీటి సరఫరాకు నష్టం జరిగింది. అన్ని రంగాల్లోనూ రాష్ట్రానికి రూ.6,882 కోట్ల నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం ప్రాథమిక అంచనా వేసి, నివేదికను కేంద్రానికి పంపనున్నట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఆర్‌అండ్‌బీకి రూ.2,164 కోట్లు, నీటివనరుల శాఖకు రూ.1,568.5 కోట్లు, పురపాలకశాఖకు రూ.1,160 కోట్లు, రెవెన్యూకు రూ.750 కోట్లు, విద్యుత్‌శాఖ రూ.481, వ్యవసాయశాఖ రూ.301 కోట్లు, పంచాయతీ రోడ్లకు రూ.167.5 కోట్లు, మత్స్యశాఖకు రూ.157.86 కోట్లు, గ్రామీణ నీటి సరఫరాకు రూ.75.5 కోట్లు, ఉద్యానశాఖకు రూ.39.9 కోట్లు, పశు సంవర్ధకశాఖకు రూ.11.5 కోట్లు, అగ్నిమాపకశాఖకు రూ.రెండు కోట్లు నష్టం వాటిల్లినట్లు ఆయా శాఖల అధికారులు ప్రాథమికంగా నివేదించారు. అంచనాలను కేంద్రానికి నివేదించడానికి సిద్ధం చేసినట్లు సీఎం తెలిపారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు నష్టం అంచనా ప్రక్రియ కొనసాగనుంది. ఇందుకోసం ఒక యాప్‌ను ప్రభుత్వం రూపొందించనుంది. ఆరోజు ఖచ్చితంగా బాధితులంతా ఇంటి దగ్గరే ఉండేలా ప్రయత్నించాలని అధికారులు కోరుతున్నారు. లేకుంటే నష్టపరిహారం జాబితాలోకి వారి వివరాలు అందే పరిస్థితి లేదు.

హైవే పక్క రైతులకు న్యాయం చేయాలి

సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-తిరుపతి: తచ్చూరు జాతీయ రహదారి పక్కన ఉన్న పంట పొలాలకు అడ్డంగా ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారని, ఈ కారణంగా విత్తనాలు విచ్చేటప్పుడు, పండిన పంటలను తరలించడంలో క్లిష్ట పరిస్థితులు ఏర్పడుతాయనీ, అందువలన తక్షణమే పంట పొలాలకు దారులు ఏర్పాటు చెయ్యాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డా కె నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఒక వీడియో విడుదల చేశారు. రైతులకు సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో హైవేకు భూములు ఇచ్చిన రైతులను సమీకరించి హైవే పనులకు అడ్డుపడతామని హెచ్చరించారు. పాదిరి బూత్వాన్నత్వం చెరువులకు వెళ్లే కాలువలను కూడా హైవే పనులు భాగంగా పూర్తి చేశారని దీనివలన దాదాపు 3 ఎకరాలకు సాగునీరు అందకుండా పంట భూములు కూడా ఎండిపోయే దారుణమైన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు, హైవే పనులకు భూములు ఇవ్వగా మిగిలిన అర, ఎకరం భూములు ఉన్న రైతులు తమ పంట పొలాల్లో పండిన పంటను తరలించలేని పరిస్థితి నెలకొన్నదని వెంటనే నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వం తక్షణంగా హైవే రోడ్డు పక్కన సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. తక్షణ చర్యలు చేపట్టడానికి తాము 15 రోజులు సమయం ఇస్తామని లేని పక్షంలో హైవే మీద వంటావార్పు కార్యక్రమం చేపడతామని నారాయణ హెచ్చరించారు ఈ విషయంపై చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దుగ్గమల్ల ప్రసాద్ రావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు.పురందేశ్వరి తో పాటు అనేక మందికి అర్జీ ఇచ్చామని వారు కూడా కేంద్రమంత్రి నితిన్ గట్కరికి విజ్ఞప్తి లేఖలు ఇచ్చినా ఇంతవరకు ఎలాంటి స్పందన లేకపోవడం చాలా బాధాకరమన్నారు.

ప్రభుత్వ అసమర్థత వల్లే ఎక్కువ నష్టం: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడలో వరద వచ్చి ఎనిమిది రోజులు గడుస్తున్నా బాధితులకు ఇప్పటికీ దారీతెన్నూ లేకుండాపోయిందని, ఇంకా ఆకలికేకలు వినిపిస్తూనే ఉన్నాయని మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అసలు ప్రభుత్వం అనేది ఉందా? లేదా? అని అనిపిస్తోందని జగన్ ట్వీట్ చేశారు. వరదలకన్నా ప్రభుత్వ అసమర్థత వల్ల వచ్చిన నష్టం భారీగా ఉందని ఆరోపించారు. రెండు, మూడు రోజుల్లో 30 సెం.మీ. పైగా వర్షం పడటం అసాధారణం ఏమీ కాదని, గతంలో చాలాసార్లు పడిందని చెప్పారు. ఈ మాదిరిగా 50 మందికిపైగా ప్రజలు చనిపోవడం ఎప్పుడూ జరగలేదన్నారు. బాధితులను లోతట్టు ప్రాంతాలనుంచి సహాయక శిబిరాలకు తరలించకపోవడం, వరదలు వచ్చి 8రోజులు అవుతున్నా, నాలుగైదు రోజులుగా వర్షాలు లేకున్నా ఇంకా ప్రజలు నీటిలోనే సహాయం అందని పరిస్థితుల్లోనే ఉండడం దారుణమని పేర్కొన్నారు. అసలు ఇదంతా ఎందుకు జరిగింది? దీనికి కారణం మీరు నిర్లక్ష్యంగా వ్యవహరించడం కాదా ? అని సీఎం చంద్రబాబును జగన్ ప్రశ్నించారు. మీ ప్రచార ఆర్భాటాల వల్ల సహాయక చర్యల్లో పూర్తిగా సమన్వయం లోపం నెలకొందని, మీకూ, మీ కూటమి మంత్రి నాదెండ్లకూ మధ్య జరిగిన సంభాషణపై వైరల్ అయిన వీడియోనే దీనికి సాక్ష్యమని తెలిపారు. బాధితులకు బియ్యం, పప్పు, నూనె తదితర సరుకులు ఇవ్వడం ఆంధ్రప్రదేశ్‌లో ఇదే తొలిసారి అన్నట్టుగా... దాన్నే ఓ పెద్ద ప్యాకేజీగా చూపించి మీరు ప్రచారం చేసుకుంటున్న తీరు చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందన్నారు. వరదబాధిత ప్రాంతాల్లో ఏ ఒక్కరిని కదిపినా దీనగాథలే వినిపిస్తు న్నాయని.. వారికి ఉదారంగా సహాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని జగన్ అన్నారు.

సీపీఐ అధ్వర్యంలో

బాధితులకు దుప్పట్ల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ తెలంగాణలకు కేంద్రం తక్షణమే వరద సాయం అందించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, పార్లమెంట్‌లో సీపీఐ పక్ష నేత సంతోశ్ కుమార్ డిమాండ్ చేశారు. విజయవాడ నగరంలోని భవానీపురం, జోజినగర్‌లో ఇంటింటికి వెళ్లి వరద ముంపులో చిక్కుకున్న వారికి సీపీఐ అధ్వర్యంలో దుప్పట్లు, టవళ్లను సంతోశ్‌కుమార్‌తోపాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంతోశ్ కుమార్ మాట్లాడుతూ ఏపీలో వరద విపత్తు కలచివేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఏపీ, తెలంగాణలకు వరద సాయం ప్రకటించి అందించాలని డిమాండ్ చేశారు. రామకృష్ణ మాట్లాడుతూ, బుడమేరు, కొల్లేరు పరివాహక ప్రాంతాల ఆక్రమణలే విజయవాడ నగర ప్రజల పాలిట శాపంగా పరిణమించాయని తీవ్రంగా దుయ్యబట్టారు. దశాబ్దాల కాలంగా బుడమేరు ముంపు సమస్య విజయవాడ నగరవాసులను వేదిస్తోందన్నారు. బుడమేరకు శాశ్వత పరిష్కార మార్గం చూపాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో వరద విజయవాడ నగరాన్ని ముంచెత్తి అపార నష్టాన్ని మిగిల్చిందన్నారు. బుడమేరు కాలువ నానాటికీ ఆక్రమణలతో కుదించుకుపోతున్నప్పటికీ..అధికార యంత్రాంగం కళ్లు మూసుకోవడం తీవ్రమైన తప్పిదమన్నారు. వేల ఎకరాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సు కబ్జాదారుల కోరల్లో చిక్కుకొని, ఆక్రమణలకు గురవటం బాధాకరమని తెలిపారు. బుడమేరు, కొల్లేరు ఆక్రమణలు ప్రజలకు శాపంగా పరిణామించాయన్నారు. బుడమేరుకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి పూనుకోవాలని, నదులు కాలువలు, వాగులు, వంకలు, చెరువులు పరిరక్షణకు తెలంగాణలోని హైడ్రా తరహాలో ఒక నిర్దిష్ట ప్రణాళికతో ఆక్రమణదారులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యవర్గ సభ్యులు తాడి పైడియ్య, కొట్టు రమణరావు, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, కోశాధికారి ఎం.సాయికుమార్, బందెల నాసర్, జి.మస్తాన్ స్థానిక పార్టీ నాయకులు జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తుల వక్రీకరణను తిప్పి కొట్టండి

తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర బుక్‌లెట్ ఆవిష్కరణలో సురవరం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదనీ, నేడు ఈ చరిత్రకు సంబంధంలేని మతోన్మాద శక్తులు వాస్తవికతను వక్రీకరిస్తూ హిందూ, ముస్లిం పోరాటంగా చిత్రీకరిస్తున్నారనీ, మత చాంద్రసవాదులు కుట్రలను వక్రీకరణను తిప్పికొడుతూ తెలంగాణ సాయుధ పోరాటాన్ని వాస్తవికత చరిత్రను ప్రజల్లో విస్తృత ప్రచారం చేసి తెలంగాణను లౌకిక ప్రజాస్వామ్యం వైపు నడిపించాలని సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ మాజీ సభ్యులు సురవరం సుధాకరరెడ్డి పిలుపు నిచ్చారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నాలుగు భాషల్లో ప్రచురించిన బుక్లెట్‌ను సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సురవరం చేతుల మీదుగా విడుదల చేశారు. అంతకుముందు తెలంగాణ సాయుధ పోరాట సేనాని రావి నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి అధ్యక్షతన జరిగిన సభలో సురవరం ప్రసంగం కొనసాగిస్తూ, తెలంగాణ చరిత్రతోనూ, పోరాటంతోనూ సంబంధం లేని మతోన్మాదశక్తులు ఇవాళ తెలంగాణ చరిత్రకు మతం రంగు పులుముతున్నాయన్నారు. ప్రజలకు, ప్రజాపీడకులైన దొరలు, దేశముఖ్‌లకు మధ్య జరిగిన తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ మతం రంగు అద్దుతున్నారని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాట వాస్తవిక గాథ నేటి యువతరానికి తెలియాల్సి ఉందన్నారు. నైజాం పాలనలో వేల ఎకరాల భూములు ఆక్రమణకు గురయ్యాయి. మహిళలపై అఘాయిత్యాలు జరిగేవి, మాట వినకపోతే క్రూరమైన శిక్షలు విధించేవారు. ఈ కష్టాల కడలి నుంచి బయటపడాలని ఆలోచిస్తున్న క్రమంలో ఆంధ్రమహాసభ ఉద్యమం ప్రారంభమైంది. కమ్యూనిస్టు పార్టీ గ్రామాల్లో ప్రజలను సంఘటితం చేసి, భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని నిర్మించింది. రైతుల పంటలను భూస్వాములు లాక్కుంటున్న తరుణంలో ప్రజలు తిరగబడ్డారు. చేతికి దొరికిన ఆయుధంతో దొరల గూండాలను తరిమి కొట్టారు. అనంతరం 1947 సెప్టెంబర్ 11న కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చింది. ప్రజలు బందూకులు చేతబట్టి దొరలను గడగడలాడించారు. ఇలాంటి మహత్తరమైన సాయుధ పోరాట చరిత్రను అభాసుపాలు చేసి వక్రీకరించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ చూస్తోందన్నారు. ఈ మతోన్మాద శక్తులను ఓడించేందుకు జ్ఞానవంతమైన తెలంగాణ సమాజం ముందుకు రావాలని సురవరం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు పల్లా వెంకటరెడ్డి, ఈటి నరసింహ, బి విజయలక్ష్మి, ఉజ్జిని రత్నాకర్ రావు, రవీంద్రాచారి, ముత్యాల యాదిరెడ్డి, శేఖర్ రెడ్డి, చందు, స్టాలిన్, కమతం యాదగిరి, పల్లె నరసింహ, కలకొండ కాంతయ్య, కాంపల్లి శ్రీనివాస్, మామిడి చెట్ల వెంకటస్వామి, నెర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వారంరోజులు టీడీపీ 'ప్రజా వేదిక' రద్దు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వర్షాలు, వరదలు కారణంగా అధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు సహాయక చర్యల్లో నిమగ్నమైనందున వారం రోజుల పాటు "ప్రజా వేదిక" కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి, ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరగాల్సిన "ప్రజా వేదిక" కార్యక్రమం ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వారం రోజుల పాటు రద్దు చేసినట్లు చెప్పారు. తెలుగుదేశం పార్టీ శ్రేణులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

తీవ్రంగా నష్ట పోయాం...ఆదుకోండి

సీఎంకు పబ్లిషర్లు, ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానుల విజ్ఞప్తి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): బుడమేరు ముంపు కారణంగా అన్ని రకాలుగా నష్టపోయిన తమను ఆదుకోవాలని విజయవాడ నగరంలోని పబ్లిషర్స్, ప్రింటింగ్ ప్రెస్‌ల యాజమాన్యాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి విజ్ఞప్తి చేశాయి. సింగ్ నగర్, పాయకాపురం, కండ్రిక, రాజరాజేశ్వరీ పేట తదితర ప్రాంతాల్లో గల 18 ప్రింటింగ్, పబ్లిషింగ్ సంస్థలు నీట మునిగాయని ఆ వినతిపత్రంలో తెలిపాయి. ఆయా సంస్థలకు సంబంధించి 50 కోట్ల రూపాయల విలువైన మెషినరీ, 200 కోట్ల రూపాయల విలువైన సరుకు, ముడి పదార్థాలు నీట మునిగాయనీ, 150 కోట్ల రూపాయల విలువైన 1500 టన్నుల పేపర్ నీట మునిగి పనికి రాకుండా పోయిందని తెలిపాయి. పబ్లిషర్స్, ప్రింటర్స్ ప్రభుత్వం, వివిధ విద్యాసంస్థలకు చెందిన టెక్స్ట్‌బుక్స్ తో పాటు వివిధ రకాల స్టడీ మెటీరియల్ ను ముద్రించడంలో ప్రధాన భాగస్వాములుగా ఉన్నారు. దాదాపు 30 లక్షల పుస్తకాల ముద్రణ కు వరద విఘాతం కల్గించింది. ప్రకృతి విలయం వల్ల తమ సంస్థల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందనీ, ఇప్పటికీ మా సంస్థలు జల దిగ్బంధంలోనే ఉన్నాయనీ, వరద ముంపు వల్ల తమ సంస్థలలో పని చేసే రెండువేల మంది సిబ్బంది తో పాటు పరోక్షంగా ప్రింటింగ్ రంగం మీద ఆధారపడి జీవిస్తున్న దాదాపు ఐదు వేల మంది కార్మికులు కూడా రోడ్డున పడ్డారని తెలిపారు. అందు వల్ల తమకు కల్గిన నష్టాల నుంచి బయట వేసేందుకు అన్ని విధాలుగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. జరిగిన నష్టం నుంచి కోల్కొని తిరిగి ప్రింటింగ్ కార్యకలాపాలు కొనసాగేందుకు ఆర్థిక సాయం అందించాలనీ, వరద వల్ల నష్టపోయిన సంస్థలకు పన్ను మినహాయింపులు, సబ్సిడీలు అందించడం ద్వారా వ్యాపారం తిరిగి కొనసాగించేందుకు తోడ్పడాలనీ, ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ త్వరగా సెటిల్ చేసేలా చేయడంతోపాటు వాటిలో లోపాలు ఉంటే పరిగణలోకి తీసుకోకుండా యాజమాన్యాలకు ఊరట కల్పించాలనీ, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల చెల్లింపులో వెసులుబాటు కల్పించాలనీ, కనీసం 12 నెలలు మారటోరియం విధించేలా ప్రభుత్వం బ్యాంకులకు ఆదేశాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. కేటగిరీ 3 లో ఉన్న మా సంస్థలు ఉత్పత్తి ప్రారంభించేందుకు రానున్న 4 నెలలు విద్యుత్ బిల్లులను రద్దు చేయాలనీ, ప్రస్తుత మెషీన్లు వినియోగంలోకి రాక పోతే కొత్త మెషీన్ల కొనుగోలుకు ప్రభుత్వం సబ్సిడీలు ఇవ్వాలనీ, బ్యాంకులు,. ఫైనాన్సియల్ ఇనిస్టిట్యూషన్స్ వడ్డీ రాయితీలు, సబ్సిడీలు ఇచ్చేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలనీ, వరద బారీన పడిన ప్రింటింగ్ సంస్థలలో తక్షణమే క్లీనింగ్ చేయించే విధంగా ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. గత 10 ఏళ్లుగా ప్రభుత్వం నుంచి రావలసిన బిల్లులను సాధ్యమైనంత త్వరగా విడుదల చేస్తే తమకు కొంత తోడ్పాటు గా ఉంటుందని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు.

కౌంటర్ వెయిట్‌ల ఏర్పాటు విజయవంతం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇటీవల ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద వచ్చిన సమయంలో, ఐదు గుర్తు తెలియని ఇసుక పడవలు ఢీకొనడంతో దెబ్బతిన్న 67, 69, 70 గేట్ల కౌంటర్ వెయిట్‌ల బిగింపు ప్రక్రియను జలవనరుల శాఖ అధికారులు ఆదివారం పూర్తి చేశారు. తొలుత 69 గేటు కౌంటర్ వెయిట్ మాత్రమే దెబ్బతిన్నట్లుగా గుర్తించగా... ఆ తర్వాత మొత్తం మూడు గేట్లు దెబ్బతిన్నట్లు జలవనరులశాఖ మెకానిక్ విభాగం సలహాదారుడు కె కన్నయ్య నాయుడు నిర్ధారించారు. దీంతో మొత్తం మూడు గేట్లకు కౌంటర్ వెయిట్లను ఆదివారం బిగించగా... అందులో మెటల్, కాంక్రీట్ చేసే పనులను రానున్న రెండు రోజులలో పూర్తి చేసేందుకు జలవనరులశాఖ నిపుణులు ముమ్మరంగా శ్రమిస్తున్నారు. ఈ నెల రెండో తేదీన ప్రకాశం బ్యారేజీకి అత్యధికంగా 11.43 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. బ్యారేజీకి ఎగువన ఒక పడవ బలంగా ఢీకొనడంతో 69వ నంబర్ గేటు కౌంటర్ వెయిట్ విరిగిపోయి రెండు ముక్కలైంది. ఆ తర్వాత మరో నాలుగు ఇసుక పడవలు బ్యారేజీ గేట్లను ఢీకొనడంతో బ్యారేజీ పటిష్టతపై ప్రభుత్వం ఆందోళన చెందింది. ఈ నేపథ్యంలో జలవనరులశాఖ మెకానికల్ విభాగం సలహాదారుడు కన్నయ్యనాయుడును సీఎం చంద్రబాబు రంగంలోకి దించారు. ప్రాథమిక విచారణలో 69వ గేటు కౌంటర్ వెయిట్ దెబ్బతిందని గుర్తించినప్పటికీ, ఆ ప్రభావం 67, 70 గేట్లపైనా పడినట్లుగా నిర్ధారణకొచ్చారు. కాగా, 68వ గేటు కౌంటర్ వెయిట్ సురక్షితంగానే ఉన్నట్లు నిపుణులు తెలిపారు. దీంతో వినాయక చవితినాడు హైదరాబాద్‌కు చెందిన బెకామ్ ఇన్‌ఫ్రా సంస్థ మొత్తం మూడు గేట్ల కౌంటర్ వెయిట్‌లను తొలగించి, వాటి స్థానంలో కొత్త వాటిని బిగించారు. అందులో మెటల్, కాంక్రిట్‌ను నింపేందుకు జలవనరులశాఖ నిపుణులు కసరత్తు చేస్తున్నారు. కౌంటర్ వెయిట్‌లను పూర్తిస్థాయిలో బిగించడంతోపాటు గేట్ల మరమ్మతు పనులు పూర్తి చేయాలని జలవనరులశాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో భాగంగానే, రెండోసారి ప్రకాశం బ్యారేజీకి వరద వచ్చేలోపే మూడు గేట్ల కౌంటర్ వెయిట్‌ల బిగింపు పనులను పూర్తి చేశారు. ఈ సందర్భంగా సలహాదారుడు కన్నయ్య నాయుడు మాట్లాడుతూ... హైదరాబాద్‌కు చెందిన బెకామ్ ఇన్‌ఫ్రా సంస్థ అధ్వర్యంలో కౌంటర్ వెయిట్‌ల బిగింపు పనులు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం బ్యారేజీకి 4.50 లక్షల క్యూసెక్కుల వరద వస్తోందని... అన్ని గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నామ న్నారు. కృష్ణా సెంట్రల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీవీఆర్ కృష్ణా రావు మాట్లాడుతూ, కౌంటర్ వెయిట్‌ల బిగింపు ప్రక్రియ పూర్తయిన తర్వాత, గేట్లకు అడ్డం పడిన బోటుల తొలగింపు పనులు చేపడతామన్నారు.

సీఎం చంద్రబాబు పరిశీలన

విజయవాడలో వరద ముంపు ప్రాంతాల పర్యటన నసందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రకాశం బ్యారేజీ వద్ద 67, 69, 70 గేట్ల కౌంటర్‌వెయిట్ పనులను సలహాదారు కన్నయ్య నాయుడుతో కలిసి ఆదివారం పరిశీలించారు. కౌంటర్‌వెయిట్‌లను విజయవంతంగా అమర్చినందుకు ఇంజనీరింగ్ నిపుణులను ఆయన అభినందించారు. బ్యారేజీ వద్ద జరుగుతున్న పనులపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రకాశం బ్యారేజీ భద్రతపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కన్నయ్యనాయుడును ఆదేశించారు. అలాగే బ్యారేజీ గేట్లకు ఎటువంటి నష్టం జరగకుండా నిపుణులు ఇసుక పడవలను తొలగించాలని ఆయన సూచించారు.

వరద బాధితులకు ఎస్ఎఫ్ బాసట

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడలో వరద నీటిలో చిక్కుకుని విలపిస్తున్న బాధితులకు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అండగా నిలిచింది. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని ముంపు ప్రాంతాల్లో బాధితులకు మందులు, బిస్కెట్లు, వాటర్ బాటిళ్లను అందజేసింది. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు, ఉపాధ్యక్షులు బందెల నాసర్‌జీ.సహాయ కార్యదర్శి మస్తాన్ షన్ను, కోశాధికారి సాయికుమార్, అమర్నాథ్, డేవిడ్, కిరణ్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

నీచ రాజకీయాలకు పరాకాష్ఠ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ సమక్షంలో పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ భర్త గంటా ప్రసాద్ రావు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చూసి వైసీపీ నేతలు తమ పార్టీలో చేరుతున్నారని చెప్పారు. విజయవాడలో విపత్తుకు గడిచిన ఐదేళ్లలో జగన్ అండ్ కో చేసిన అరాచకాలే కారణమని విమర్శించారు. బుడమేరుకు లాకులు పెట్టకుండా కబ్జా చేసిపడేసింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. విశాలంగా ఉండే బుడమేరును కబ్జాలు చేసి పిల్ల కాలువలా మార్చేసింది వైసీపీ వాళ్లేనని అన్నారు. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు ఓ ముఖ్యమంత్రి ఇంత బాధ్యతగా వ్యవహరిస్తుంటే దానినీ వైసీపి తప్పు పట్టడం నీచ రాజకీయాలకు పరాకాష్ఠ అని పల్లా శ్రీనివాస్ విమర్శించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.